సంపుటి : 9
సంచిక : 282
ఆదివారం
05 జూలై 2026
పేజీలు : 12
వెల : 2/-

E-PAPER

# విశ్వవాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE




Contact For Ads:
7579339999

# 'స్వర్ణ కుప్పం'కు నాంది

- రూ.118 కోట్లతో మోడల్ బస్ స్టేషన్, డిపోకు సీఎం శంకుస్థాపన
- కుప్పంలోనూ గోల్డ్ ఫీల్డ్స్..ఉద్యోగాలకు ఇక్కడికే రావాలి
- ప్రజలు అమరావతి అంటే.. గొడ్డలి పార్టీ మావిగన్ అంటోంది
- గత పాలకులు కుప్పంపై కక్షగట్టి... సినిమా సెట్టింగులతో డ్రామాలు ఆడారు
- 'సీమలో ఫ్యాక్షన్ యుగం ముగిసింది... ఇప్పుడు అభివృద్ధే అజెండా
- కుప్పం బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు




**కుప్పం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్వర్ణ కుప్పం లక్ష్యంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. కుప్పంలో రూ.118 కోట్లతో నిర్మించనున్న ఆధునిక ఆర్టీసీ బస్ స్టేషన్, డిపోకు శంకుస్థాపన చేసిన అనంతరం... అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. అభివృద్ధి అంశాలతో పాటు గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. వివేకానందరెడ్డి హత్య నుంచి కోడికత్తి ఘటన, డాక్టర్ సుధాకర్, డ్రైవర్ సుబ్రహ్మణ్యం, అమరావతి రాజధాని, కుప్పం అభివృద్ధి వరకు గత ప్రభుత్వంలో జరిగిన విధానాలను ముఖ్యమంత్రి ఎండగట్టారు.

**ఉద్యోగాల కోసం కుప్పమే రావాలి**

ఎన్టీఆర్ హయాంలో కుప్పంలో బస్ స్టేషన్‌కు శంకుస్థాపన జరిగిందని, ఇప్పుడు అత్యాధునిక మోడల్ బస్ స్టేషన్, డిపో నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నామని చంద్రబాబు తెలిపారు. డిపోలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహిస్తామని చెప్పారు. కుప్పాన్ని స్వర్ణ కుప్పంగా తీర్చిదిద్దే దిశగా పరిశ్రమలు తీసుకొస్తున్నామని, ఉద్యోగాల కోసం కుప్పం ప్రజలు బయటకు వెళ్లాల్సిన అవసరం లేకుండా... ఇతర ప్రాంతాల వారు కుప్పానికి వచ్చే పరిస్థితి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఒక్క రోజులోనే రూ.9,322 కోట్ల పెట్టుబడులతో 30 ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, ఎంఓయూలు జరిగాయని, వాటి ద్వారా సుమారు 80 వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభిస్తుందని వివరించారు. అడిడాస్ ఫుట్‌వేర్ సంస్థ కోసం అనేక రాష్ట్రాలు పోటీ పడినా అది కుప్పాన్నే ఎంచుకుందని చెప్పారు. టూ సీటర్ ట్రైనీ ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ పరిశ్రమతో పాటు డెయిరీ, ఫుడ్ ప్రాసెసింగ్, పౌల్ట్రీ పరిశ్రమలు కూడా కుప్పానికి వచ్చాయని వెల్లడించారు.

**కుప్పంలోనూ బంగారు గనులు**

కర్నూలు జిల్లా జొన్నగిరిలో గోల్డ్ ఫీల్డ్స్ ప్రారంభించినట్లే కుప్పంలోనూ బంగారు గనులు ఉన్నాయని చెబుతున్నారని, సాంకేతిక పరిజ్ఞానంతో వాటిని అందుబాటులోకి తీసుకొచ్చి స్వర్ణ కుప్పానికి నాంది పలుకుతామని ప్రకటించారు. మైక్రో ఇరిగేషన్‌లో మిగతా .. 2లో..

### విదేశీ పర్యటన వేళ.. ప్రధాని మోదీకి

# ఆన్‌లైన్‌లో బెదిరింపులు



**విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరో రెండు రోజుల్లో మూడు దేశాల పర్యటనకు వెళ్లనున్నారు. జులై 6 నుంచి ఇండోనేసియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో ఆయన పర్యటన కొనసాగనుంది. ఈ క్రమంలో ఆస్ట్రేలియాకు వస్తే.. భారత ప్రధానిని చంపుతామంటూ సోషల్ మీడియాలో ఓ వ్యక్తి బెది రింపులకు పాల్పడినట్లు తెలిసింది. దీంతో ఆస్ట్రేలియా ఫెడరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. విదేశీ పర్యటనలో భాగంగా జులై 8న ప్రధాని మోదీ ఆస్ట్రేలియా చేరుకుంటారు. జులై 9న అక్కడ జరిగే 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ ఈవెంట్‌కు సంబంధించి సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు కింద ప్రధాని మోదీని లక్ష్యంగా చేసుకొని ఓ వ్యక్తి బెదిరింపు కామెంట్లు చేశాడు. దీనిపై ఇప్పటికే దర్యాప్తు చేపట్టిన ఆస్ట్రేలియా ఫెడరల్ పోలీసులు.. ఆ బెదిరింపు పోస్టునకు సంబంధించిన ఐపీ అడ్రస్‌ను గుర్తించారు. ఈ నేపథ్యంలో మోదీ కార్యక్రమానికి భద్రతను మరింత కట్టుదిట్టం చేయనున్నట్లు సమాచారం.

### తిరుమలలో రెండు రోజులు

# వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు



**తిరుమల, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుమలలో జులై 14, 17 తేదీల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు తితిదే వెల్లడించింది. ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. జులై 14న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, మిగతా .. 2లో..

### ఉమర్ ఖాలిద్‌కు

# బెయిల్ నిరాకరణ



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఢిల్లీ అల్లర్ల కేసులో అరెస్టయి జైలులో ఉన్న ఉమర్ ఖాలిద్, షర్జీల్ ఇమామ్‌కు ఢిల్లీ కోర్టు బెయిల్ నిరాకరించింది. వారిద్దరికీ బెయిల్ నిరాకరిస్తూ గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కోర్టు గుర్తుచేసింది. అసలు వీరి బెయిల్ దరఖాస్తులు కూడా విచారణకు యోగ్యమైనవి కాదని.. అందువల్లే వాటిని కొట్టివేస్తున్నామని వెల్లడించింది.

**2020 ఢిల్లీ అల్లర్ల కేసు..**

పౌరసత్వ సవరణ మిగతా .. 2లో..

### గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై

# మంత్రి నారాయణ సమీక్ష



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వచ్చే ఏడాది నిర్వహించే గోదావరి పుష్కరాలకు సంబంధించిన ఏర్పాట్లపై తూర్పుగోదావరి జిల్లా అధికారులతో మంత్రి నారాయణ సమీక్షించారు. గోదావరి పుష్కరాల కోసం సీఎం చంద్రబాబు రూ.1500 కోట్లు మంజూరు చేశారని అన్నారు. వీటిలో కేవలం రాజమహేంద్రవరంలో పుష్కరాల కోసమే రూ.580 కోట్ల పనులకు సీఎం అనుమతించారని చెప్పారు. "పుష్కరాలకు రాజమహేంద్రవరంలో కల్పించాల్సిన సదుపాయాలపై చర్చించాం. పనులు వెంటనే ప్రారంభించాలన్న సీఎం ఆదేశాల మేరకు చేపట్టాల్సిన పనులు నిర్ణయించాం. ప్రస్తుత నిధులతో తొలిదశ పనులు ప్రారంభిస్తున్నాం. రాజమహేంద్రవరంలో మురుగు నీటి శుద్ధి కేంద్రాలను నిర్మిస్తాం. గోదావరిలో మురుగు నీరు కలవకుండా చర్యలు తీసుకుంటాం. రాజమహేంద్రవరంలో డ్రైనేజీ కాల్వల నిర్మాణం కోసం మిగతా .. 2లో..

### ఎన్నిసార్లు

# అరెస్ట్ చేస్తారు?

**సినీ నటుడు ప్రకాష్ రాజ్**



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ ప్రశ్న రావణ్ (బచ్చులకూరి జోసెఫ్)పై ఏపీలో పలు కేసులు నమోదైన సంగతి తెలిసిందే. బెయిల్‌పై మిగతా .. 2లో..

# రొయ్యల్లో 'వైట్ గట్' వ్యాధి..

**అధికారులను అప్రమత్తం చేసిన మంత్రి అచ్చెన్నాయుడు**





**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రొయ్యల్లో 'వైట్ గట్' వ్యాధి లక్షణాలపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందించారు. మత్స్యశాఖ అధికారులను అప్రమత్తం చేశారు. క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. వ్యాధి నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత సంస్థలకు సూచించారు. మరోవైపు ఉండి మండలంలోని మహదేవిపట్నం చెరువును అధికారులు పరిశీలించారు. రైతు చెరువులో రొయ్యలు, ఫీడ్, నీటి నమూనాలను సేకరించారు. వాటిని కైకలూరు, భీమవరం ల్యాబ్‌కు పంపించారు. రైతులకు తాజా ఎస్‌వోపీ ప్రకారం అవగాహన కల్పించాలని అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దని.. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

### రాష్ట్ర అభివృద్ధి చూడలేకే

# జగన్ కుట్రలు

**ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు**



**రాజాం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉత్తరాంధ్ర ప్రగతిని కళ్లారా చూస్తున్నామని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఏపీలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికే మార్గదర్శకమని చెప్పారు. విజయనగరం జిల్లా రాజాం తెదేపా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధిని చూసి ఓర్వలేకే మిగతా .. 2లో..

### వైకాపా కోవర్టుగా ప్రకాశ్ రాజ్..

# పవన్‌పై కుట్రలు


**తిరుపతి జనసేన ఇన్‌ఛార్జి కిరణ్ రాయల్**



**తిరుపతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీలో మత విద్వేషాలను రెచ్చగొడుతున్న రావణ్, శ్రవణ్‌లతోపాటు వైకాపాకి కోవర్టుగా వ్యవహరిస్తున్న సినీనటుడు ప్రకాశ్‌రాజ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని తిరుపతి జనసేన ఇన్‌ఛార్జి కిరణ్ రాయల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారి వ్యవహారశైలికి సంబంధించిన ఆడియో లీకులను శనివారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా తిరుపతిలో మీడియాతో మాట్లాడుతూ వైకాపా సోషల్ మీడియా విభాగం, పేటీఎం బ్యాచ్‌లకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రధాన లక్ష్యంగా మారారని మండిపడ్డారు. పవన్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులపైనా ఉద్దేశపూర్వకంగా అసభ్యకరమైన పోస్టులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్‌ను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న కుట్రల్లో భాగంగానే నటుడు ప్రకాశ్‌రాజ్ ఆయనపై విమర్శలు చేస్తున్నారని, రాష్ట్రంలో అశాంతి సృష్టించడమే వారి ప్రధాన లక్ష్యమని ఆరోపించారు. ప్రజల దృష్టిని మరల్చేందుకే మాజీ సీఎం జగన్ డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతూ 'మావిగన్' పేరుతో మిగతా .. 2లో..

### పవన్ కల్యాణ్‌ను కుల చట్రంలో

# బంధించేందుకు కుట్రలు




**మంత్రి కందుల దుర్గేష్**

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** సినీ నటుడు ప్రకాశ్‌రాజ్, కాకినాడకు చెందిన యూట్యూబర్ బచ్చులకూరి జోసెఫ్ (రావణ్) వ్యాఖ్యలపై మంత్రి కందుల దుర్గేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జస్ట్ ఆస్కింగ్ అంటున్న ప్రకాశ్ రాజ్, జోసెఫ్ మధ్య మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జోసెఫ్ సూచనలతో ప్రకాశ్‌రాజ్ స్పందిస్తారని విమర్శించారు. "ఇద్దరి మధ్య అనుబంధం ఉందనేందుకు మా దగ్గర ఆధారాలున్నాయి. జోసెఫ్ ప్రశ్నించగానే.. జస్ట్ ఆస్కింగ్ అంటూ ప్రకాశ్‌రాజ్ వస్తారు. పవన్ కల్యాణ్ లక్ష్యంగా ఇద్దరూ కలిసి కుట్రలు చేస్తున్నారు. తెరముందు వీళ్లుంటే.. తెర వెనుక ఎవరున్నారో తేలాలి. తాడేపల్లి ప్యాలెస్ డైరెక్షన్‌లోనే ఈ కుట్ర సాగుతోంది. కుల, మత విద్వేషాలు రెచ్చగొట్టేలా కుట్రలు చేస్తున్నారు. ఇలాంటి సంఘవిద్రోహ శక్తులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలి. వైకాపా పాలనలో జస్ట్ ఆస్కింగ్ అని ఎందుకు అడగలేకపోయారు? పవన్ కల్యాణ్‌ను ఒక కుల చట్రంలో బంధించేందుకు కుట్రలు చేస్తున్నారు. ప్రశ్నించడం అంటే.. బూతులు తిట్టడం.. వ్యక్తిగత విమర్శలు చేయడమా? ప్యాలెస్ నుంచి వచ్చే మిగతా .. 2లో..

# పాకిస్థాన్‌తో పోలికా..

**చైనా పాత్రికేయుడి ప్రశ్నకు భారత దౌత్యవేత్త ఘాటు రిప్లై**




**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా–ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం విషయంలో మధ్యవర్తిత్వంపై పాకిస్థాన్‌తో భారత్‌ను పోల్చడంపై చైనాలో భారత దౌత్యవేత్త విక్రమ్ దొరైస్వామి ఘాటుగా స్పందించారు. ఆ దేశంతో పోలిక అవసరం లేదన్న ఆయన.. అలా సరిపోల్చడం ఆ దేశ ప్రయోజనాలకు మేలు చేస్తుందో? లేదో అనే విషయాన్ని వారే గ్రహించుకోవాలని పాక్‌నుద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ విషయంలో పాక్‌ను అనుసరించాల్సిన అవసరం తమకు లేదని స్పష్టం చేశారు. బీజింగ్‌లో జరుగుతున్న ఓ సదస్సులో దొరైస్వామి మాట్లాడుతూ అంతర్జాతీయ వ్యవహారాల్లో భారత్ పాత్ర, పాక్ మధ్యవర్తిత్వంపై ఓ చైనా పాత్రికేయుడు అడిగిన ప్రశ్నకు దీటుగా బదులిచ్చారు. "పాకిస్థాన్‌తో పోల్చడాన్ని అన్యాయంగానే భావిస్తున్నా. రెండు దేశాల ఆర్థిక వ్యవస్థలే మనకు చాలా విషయాలు చెబుతాయి. విస్తృత ప్రపంచ వ్యవస్థలో కొన్ని దేశాల (పాక్‌ను ఉద్దేశిస్తూ) స్థానం ఏంటి? వాస్తవానికి ఏం చేస్తున్నాయి? అనే విషయాన్ని గమనించాలి. ప్రపంచంతో భారత్‌కు ఉన్న సంబంధాలు చాలా దేశాలకు అందనంత మిగతా .. 2లో..




# కేసీఆర్‌కు 1000 ఎకరాల ఫామ్‌హౌస్ ఎలా వచ్చింది?

**తెలంగాణా సీఎం రేవంత్‌రెడ్డి**



**మిడ్జిల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆనాడు మిడ్జిల్ మండల ప్రజలు నాటిన మొక్క ఇవాళ మహా వృక్షమైందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తొలిసారిగా 2006 జులై 4న మిడ్జిల్ ప్రజలు ఆశీర్వదించారని గుర్తు చేసుకున్నారు. 20 ఏళ్ల రాజకీయ జీవితం పూర్తయిన సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా మిడ్జిల్‌లో నిర్వహించిన కృతజ్ఞత సభలో సీఎం మాట్లాడారు. తన రాజకీయ ప్రయాణంలో కీలకమైన మండల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. "మిడ్జిల్, మిగతా .. 2లో..

# నా కొడుకుని పోలీసులే చంపేశారు

**మెజిస్ట్రీరియల్ విచారణలో సాయికృష్ణ తల్లి**



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీలో సంచలనం సృష్టించిన రౌడీషీటర్ గాదె సాయికృష్ణ లాకప్ డెత్ కేసులో మెజిస్ట్రీరియల్ విచారణ కీలక దశకు చేరుకుంది. విజయవాడలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు జరిగిన విచారణకు సాయికృష్ణ మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# 'స్వర్ణ కుప్పం'కు నాంది

కుప్పం దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్న సీఎం... రాష్ట్రానికి అది శ్రీరామరక్షగా మారిందన్నారు. హంద్రీ-నీవా కాలువ ద్వారా కుప్పానికి నీరు తీసుకొచ్చి 110 చెరువులు నింపామని చెప్పారు. పూర్వోదయ ప్రాజెక్టు ద్వారా ఉద్యాన పంటలను ప్రోత్సహించి రాయలసీమను అభివృద్ధి చేస్తామని, వచ్చే నెలలో మదనపల్లెలో దానికి శంకుస్థాపన చేస్తామని తెలిపారు. కుప్పంలో రోజుకు 10 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి లక్ష్యంగా డెయిరీ రంగాన్ని విస్తరిస్తామని, వాణిజ్య పంటలకు పెద్దపీట వేస్తామని చెప్పారు.

### కాలుష్య రహిత కుప్పం నిర్మిద్దాం

ఎస్సీ, ఎస్టీలకు సోలార్ రూఫ్‌టాప్ ద్వారా ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, బీసీలు, ఓసీల ఇళ్లపైనా రూ.552 కోట్లతో సోలార్ విద్యుత్ సదుపాయం కల్పిస్తామని చెప్పారు. నెట్ జీరో విధానంలో భాగంగా ఇంటి మిద్దెలపైనే కూరగాయలు పండించే విధానాన్ని ప్రోత్సహించాలని, ఈ-సైకిళ్ల వినియోగం పెంచి కాలుష్యరహిత కుప్పాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించి సౌర విద్యుత్ ఆధారిత జీవన విధానం వైపు వెళ్లాలని సూచించారు. కుప్పంలోని బ్లూ గ్రానైట్‌కు ప్రపంచ మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని, అందుకే హెరిటేజ్ గ్రానైట్ క్లస్టర్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. నియోజకవర్గమంతా మొబైల్ కనెక్టివిటీ కల్పిస్తామని, తిరుమల తర్వాత అత్యధిక గ్రీన్ కవర్ ఉన్న ప్రాంతం కుప్పమేనని, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. కుప్పం ఏరియా ఆస్పత్రిలో సీటీ స్కాన్, డయాలసిస్ సదుపాయాలు విస్తరించామని, ప్రపంచ స్థాయి వైద్య సేవలు అందుబాటులోకి తెస్తామని తెలిపారు.

### రూ.34 కోట్లతో దేవాలయాల అభివృద్ధి

కుప్పానికి వస్తున్న పరిశ్రమల్లో మంచి ఉద్యోగాలు పొందాలంటే యువత నైపుణ్య శిక్షణపై దృష్టి పెట్టాలని సూచించారు. స్కిల్ డెవలప్‌మెంట్ విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం ప్రజల భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నించిందని ఆరోపించిన చంద్రబాబు... వివాదాస్పద భూములను పరిష్కరిస్తున్నామని, శెట్టిపల్లి, వట్టిచెరుకూరు భూముల సమస్యలకు పరిష్కారం చూపామని తెలిపారు. టీటీడీ నిధులతో రూ.34 కోట్లతో కుప్పంలోని దేవాలయాలను అభివృద్ధి చేస్తామని చెప్పారు. తిరుమలలో గత పాలకమండలి కల్తీ నెయ్యి వినియోగించి భక్తుల మనోభావాలను దెబ్బతీసిందని, కూటమి ప్రభుత్వం దాన్ని అరికట్టిందని పేర్కొన్నారు. కుప్పంపై గత ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించిందని, నీళ్లు తెచ్చామని సినిమా సెట్టింగులు వేసి డ్రామాలు ఆడిందని విమర్శించారు. 2019-24 మధ్య తనను కుప్పంలో పర్యటించ నీయకుండా అడ్డుకున్నారని, తనకు సహకరించిన స్థానికులను వేధించారని ఆరోపించారు.

### ఫ్యాక్షన్ రాజకీయాలకు కాలం చెల్లింది

సీమలో ఫ్యాక్షన్ రాజకీయాలకు కాలం చెల్లిందని, ఇప్పుడు అభివృద్ధే అజెండాగా మారిందన్నారు. ప్రజల విషయంలో తాను సౌమ్యుడినేనని, కానీ సంఘ విద్రోహ శక్తుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తానని హెచ్చరించారు. మరో రెండేళ్లలో తన రాజకీయ జీవితం 50 ఏళ్లు పూర్తవుతుందని, ఇలాంటి సమయంలో కూడా రౌడీలు, మాఫియాలతో రాజకీయాలు చేయాల్సి రావడం బాధాకరమన్నారు. రౌడీలు రాజకీయాల్లోకి వచ్చినందువల్లే వివేకానందరెడ్డి హత్య జరిగిందని, కోడికత్తి డ్రామా వచ్చిందని, వాటికి తనను బాధ్యుడిని చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మాస్క్ అడిగిన డాక్టర్‌ను చనిపోయేలా చేశారని, డ్రైవర్‌ను కారు డిక్కీలో పెట్టి డోర్ డెలివరీ చేశారని వ్యాఖ్యానించారు.

### రాజధానిపై రోజుకో కొత్తమాట

రాజధానిపై ప్రతిరోజూ కొత్త మాటలు మాట్లాడుతున్నారని, కేంద్రం చట్టం చేసిన తర్వాత రాజధానిని మార్చడం సాధ్యం కాదన్నారు. అమరావతి రాజధానిని తాము కోరుకుంటుంటే, వాటికన్ తరహాలో 'మావిగన్' కావాలని గొడ్డలి పార్టీ మాట్లాడుతోందని విమర్శించారు. గొడ్డలి పార్టీ అని తాము చెప్పడం కాదని, వారే అంగీకరిస్తున్నారని వ్యాఖ్యానించారు. కుప్పాన్ని ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌గా తీర్చిదిద్దుతామని, ఎలిఫెంట్ సఫారీ, రాక్ క్లైంబింగ్, ట్రెక్కింగ్ వంటి పర్యాటక ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. సుర్బానా జురాంగ్, ఐఐటీ కాన్పూర్ సహకారంతో కుప్పం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని చెప్పారు. సీఎస్సార్, పీ4 విధానాల ద్వారా పేదలను ఆదుకుంటూ కుప్పాన్ని దేశానికి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు

జులై 17న శ్రీవారి ఆలయంలో ఆణివార ఆస్థానం కార్యక్రమాలు జరగనున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. జులై 13, 16 తేదీల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలకు సంబంధించిన సిఫార్సు లేఖలు స్వీకరించబోమని స్పష్టం చేసింది. అదే విధంగా జులై 17న కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవలను కూడా రద్దు చేసినట్లు పేర్కొంది.

# ఉమర్ ఖాలిద్‌కు బెయిల్ నికారణ

చట్టానికి వ్యతిరేకంగా 2020 ఫిబ్రవరిలో దిల్లీలో జరిగిన హింసాత్మక నిరసనలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఆ అల్లర్లలో దాదాపు 53 మంది మృతి చెందగా.. 700 మందికి పైగా గాయపడ్డారు. ఈ అల్లర్లకు సంబంధించి 15 మందిని నిందితులుగా పేర్కొంటూ చట్ట వ్యతిరేక కార్యకలాపాల చట్టం Unlawful Activities Act కింద ఛార్జిషీట్ నమోదు చేశారు. అనంతరం ఐదుగురు నిందితులకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఖాలిద్, ఇమామ్‌కు మాత్రం బెయిల్ ఇవ్వడానికి నిరాకరించింది. ఈ కేసులో మిగతా నిందితులతో పోలిస్తే వీరిద్దరిపై అభియోగాలు బలంగా ఉన్నాయని పేర్కొంది.

# రాష్ట్ర అభివృద్ధి చూడలేకే జగన్ కుట్రలు

జగన్ కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. " రాష్ట్ర పరువును దిల్లీలో తీసేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారు. సొంత జిల్లా కడపలో స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన చేసినా పూర్తి చేయలేదు. ఐదేళ్లలో ఒక్కపని కూడా పూర్తి చేయలేకపోయారు. అభివృద్ధిలో ఏపీ అగ్రస్థానానికి చేరుకుంటుందని మోదీ ప్రశంసించారు. విద్య, ఐటీ, నీటిపారుదల రంగాల్లో ఏపీని ప్రధాని మెచ్చుకున్నారు. మౌలిక వసతులు, సాగు, సాంకేతికత రంగాల్లో రాష్ట్రాన్ని ప్రశంసించారు. మిగతా రాష్ట్రాలు రోల్ మోడల్‌గా తీసుకోవాలని మోదీ చెప్పారు. కానీ, జగన్ మాత్రం విమర్శిస్తూనే ఉన్నారు. ప్రజలు.. వైకాపాకి భవిష్యత్‌లో మరింత బుద్ధి చెప్పడం ఖాయం" అని కలిశెట్టి అన్నారు.

# గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై మంత్రి నారాయణ సమీక్ష

రూ.140కోట్లతో పనులు ప్రారంభిస్తాం.. రోడ్ల నిర్మాణం, విస్తరణ, లైటింగ్ పనులు చేపడతాం. టీడీఆర్ బాండ్లు జారీ చేసి, నగరంలో రోడ్ల విస్తరణ త్వరలో చేపడతాం. గోదావరి కాలుష్య నివారణకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు నిధులు కేటాయిస్తాం. ఘాట్ల ఆధునికీకరణ, విస్తరణను ఇరిగేషన్ శాఖ నిధుల ద్వారా అభివృద్ధి చేస్తాం" అని నారాయణ అన్నారు.

# ఎన్నిసార్లు అరెస్టు చేస్తారు?

అతడు బయటకు వస్తున్నప్పటికీ... ఇప్పటికే నమోదైన ఇతర కేసుల్లో మళ్లీ పోలీసులు అరెస్ట్ చేస్తున్నారు. దీనిపై సినీ నటుడు ప్రకాశ్ రాజ్ విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లను ట్యాగ్ చేస్తూ ఆయన విమర్శనాత్మకంగా ట్వీట్ చేశారు. "అరెస్ట్.. బెయిల్.. అరెస్ట్.. బెయిల్.. అరెస్ట్.. బెయిల్.. మళ్లీ అరెస్ట్. మీరు తప్పు చేస్తున్నారని మీకు కోర్టులు స్పష్టంగా చెప్పడం లేదా? మీ కక్షపూరిత రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారు" అంటూ ప్రకాశ్ రాజ్ విమర్శలు గుప్పించారు. "ప్రశ్నించే వారిని అధికారాన్ని దుర్వినియోగం చేసి అణచివేయడం ఎంతవరకు సాగుతుంది? కోర్టు బెయిల్ ఇచ్చిన వెంటనే మరో కేసు తెరిచి వేధించడం సిగ్గుచేటు" అని మండిపడ్డారు. రావణ్ ఏలూరులో పవన్ కల్యాణ్‌పై చేసిన వ్యాఖ్యలు వైరల్ అయిన తర్వాత పిఠాపురం పోలీసులు అతన్ని అరెస్టు చేశారు. కాకినాడ కోర్టు బెయిల్ మంజూరు చేయగా, వెంటనే సర్పవరం పోలీసులు మరో పాత కేసులో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. రావణ్‌పై మొత్తం 30 కేసులు ఉన్నాయని, ఇది స్పష్టమైన ప్రతీకార చర్య అని ప్రకాశ్ రాజ్ ఆరోపించారు. జనసేన కార్యకర్తలు పోలీస్ వాహనాన్ని అడ్డుకున్న ఘటనను కూడా ఆయన ప్రస్తావిస్తూ... ప్రశ్నిస్తే చంపేస్తారా? అని ప్రశ్నించారు.

# వైకాపా కోవర్టుగా ప్రకాశ్ రాజ్.. పవన్ కుటల్రు

కొత్త డ్రామాకు తెరలేపారని కిరణ్ రాయల్ విమర్శించారు. గతంలో అమరావతి రైతులపై కోడిగుడ్లతో దాడి చేసింది వేరే సామాజికవర్గం వారైతే.. ఆ నెపాన్ని ఉద్దేశపూర్వకంగా కాపు సామాజికవర్గంపైకి నెట్టే ప్రయత్నం చేశారని, కాపులను అదే వర్గంతో ఘర్షణకు దింపడమే జగన్ వ్యూహమని దుయ్యబట్టారు. సోషల్ మీడియాలో విద్వేషాలు రెచ్చగొట్టేవారిపై పోలీసులు బలహీనమైన సెక్షన్లతో కేసులు నమోదు చేస్తుండటంతో వారు సులువుగా బెయిల్‌పై బయటకు వస్తున్నారని పేర్కొన్నారు.

# బంధించేందుకు కుట్రలు

డబ్బు కోసమే ప్రకాశ్‌రాజ్ మాట్లాడుతున్నారు. తాడేపల్లి ప్యాలెస్ నుంచి జరిగే ఈ కుతంత్రాలను ప్రజలు తిప్పి కొట్టాలి" అని కందుల పిలుపునిచ్చారు.

# పాకిస్థాన్‌తో పోలికా..

స్థాయిలో ఉన్నాయి. ఐరోపా, ఆసియా దేశాలతో ఆర్థికంగా, శాంతి, భద్రతలకు సంబంధించిన కీలక అంశాల్లో సహకరించడానికి సిద్ధంగా ఉన్నాం" అని దొరైస్వామి తెలిపారు. 14వ ప్రపంచ శాంతి వేదిక సదస్సులో 'ప్రొటెక్షనిజం అండ్ గ్లోబల్ ఎకనామిక్ గవర్నెన్స్ ప్యానెల్'పై జరిగిన చర్చలో ఆయన ఈ విధంగా మాట్లాడారు.

# కేసీఆర్‌కు 1000 ఎకరాల ఫామ్‌హౌస్ ఎలా వచ్చింది?

కల్వకుర్తి ప్రాంతాలకు గతంలోనూ గొప్ప గొప్ప నాయకులు ఉండేవారు. హైదరాబాద్ రాష్ట్రానికి తొలి సీఎంగా చేసిన బూర్గుల రామకృష్ణారావు మహబూబ్‌నగర్ బిడ్డే. ఎంపీగా, కేంద్రమంత్రిగా దేశానికి సేవలందించిన జైపాల్‌రెడ్డి ఈ జిల్లా బిడ్డే. 2006లో జడ్పీటీసీ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన నన్ను ఇక్కడి ప్రజలు అక్కున చేర్చుకున్నారు. నాది ఈ నియోజకవర్గం కాకపోయినా.. నమ్మకంతో గెలిపించారు. మీరు నాపై పెట్టిన నమ్మకమే.. ఇవాళ నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చింది. మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు మండలాలు 2006లో డార్క్ మండలాలుగా ఉండేవి. నా రాజకీయ జీవితంలో కీలకమైన మిడ్జిల్ మండలానికి ఏదైనా చేయాల్సిన బాధ్యత నాపై ఉంది. ఈ మండలాన్ని దత్తత తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కోరుతున్నా. నేను ఏనాడూ పదవి, అధికారాన్ని దుర్వినియోగం చేయలేదు. వందేళ్లుగా కులగణన జరగలేదు. రాష్ట్రంలో కులగణన చేపట్టి దేశానికే దిక్సూచిగా నిలిచాం. దొర దురహంకారాన్ని మరోసారి బొందపెట్టాల్సిన అవసరం ఉంది. తెలంగాణ కోసం పోరాడిన గద్దర్ అన్నను దొర గడీ ముందు గంటల కొద్దీ నిలబెట్టారు. రాష్ట్రంలో పదేళ్లపాటు పేదలకు సొంతింటి కల నెరవేరలేదు. ఈ ప్రభుత్వం గ్రామగ్రామాన ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి పేదల కలను సాకారం చేస్తోంది. రూ.70వేల కోట్ల అప్పు ఉన్న రాష్ట్రాన్ని రూ.8.50 లక్షల కోట్ల అప్పుల స్థాయికి దిగజార్చారు. కేసీఆర్ ఏ గ్రామంలోనైనా డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చారా? మూడెకరాల భూమి ఇచ్చారా? కోటి ఎకరాలకు నీరు ఇచ్చారా?ఇంటికో ఉద్యోగం ఇచ్చారా? ఇసుక దోపిడీకి అడ్డువచ్చిన నేరెళ్ల దళితులను లారీలతో తొక్కించారు. పదేళ్లు తన కుటుంబానికి, బంధువులకు తప్ప.. ఎవరికైనా ఉద్యోగాలు, పదవులు వచ్చాయా? కేసీఆర్ కుటుంబం దోపిడీలు, దొంగతనాలు మళ్లీ మొదలు కావడానికి ప్రజాపాలన పోవాలా? కేసీఆర్‌కు గజ్వేల్‌లో వెయ్యి ఎకరాల ఫామ్‌హౌస్ ఎలా వచ్చింది? కేటీఆర్, కవిత, హరీశ్‌రావుకు రూ.వేల కోట్ల విలువైన భూములు, ఫామ్‌హౌస్‌లు ఎక్కడి నుంచి వచ్చాయి?" అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.

# నా కొడుకుని పోలీసులే చంపేశారు

తల్లి విజయలక్ష్మి, మేనమామ నాగేశ్వరరావు, మేనత్త హాజరయ్యారు. సుమారు రెండు గంటలకు పైగా జరిగిన ఈ విచారణలో వారు అధికారుల ముందు తమ వాంగ్మూలాలను సమర్పించారు. ఈ సందర్భంగా సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి పోలీసులపై తీవ్రమైన ఆరోపణలు చేశారు. తన కుమారుడు సాయికృష్ణను పోలీసులే దారుణంగా చంపేశారని... ఆ తర్వాత ఆధారాలు లేకుండా మృతదేహాన్ని మాయం చేశారని ఆమె ఆరోపించారు. సాయికృష్ణ కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో ఉన్నాడని తెలియడంతో తాము అక్కడికి వెళ్లామని... అయితే అప్పటి సీఐ నాగరాజు తన కుమారుడిని చూడనివ్వకుండా అడ్డుకుని, అక్కడి నుంచి వెనక్కి పంపించేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసులో పూర్తి నిజాలు వెలుగులోకి రావాలంటే సమగ్రమైన, నిష్పాక్షికమైన విచారణ జరగాలని... తన కుమారుడి మరణానికి కారణమైన వారికి శిక్ష పడేలా చూడాలని ఆమె విచారణాధికారిని వేడుకున్నారు.

### రంకెలు వేసినంత మాత్రాన..

# అంకెలు మారవు : హరీశ్‌రావు

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మొత్తం అప్పు రూ.5.16 లక్షల కోట్లు అని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పిన మాటలు అవాస్తవమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ చేసిన రూ.15 వేల కోట్ల అప్పును కూడా బీఆర్ఎస్ ఖాతాలో చూపారని విమర్శించారు. రంకెలు వేసినంత మాత్రాన అంకెలు మారిపోవంటూ ఘాటుగా స్పందించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయేనాటికి చెల్లించాల్సిన మొత్తం అప్పు రూ.4.14 లక్షల కోట్లు మాత్రమే. కల్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్ వంటి పథకాలను కేసీఆర్ అమలు చేశారు. నిధులు లేవని కేసీఆర్ ఏనాడూ సంక్షేమ పథకాలను ఆపలేదు. ఎన్నో చేస్తామని ఆనాడు కాంగ్రెస్ నేతలు బాండ్లు రాసిచ్చారు. కాంగ్రెస్ నేతల అనుభవం స్కామ్‌లు చేసేందుకే ఉపయోగపడుతోంది" అని విమర్శించారు.

# 61 ఏళ్ల కంగుంది భూ సమస్యకు ముగింపు

**322 మంది పేదలకు పట్టాలు పంపిణీ చేసిన సీఎం**

**సామాజిక న్యాయంపట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని ముఖ్యమంత్రి వ్యాఖ్య**

**ఏడాదిలో రాష్ట్రవ్యాప్తంగా భూ వివాదాలు పరిష్కరిస్తాం**

**అభివృద్ధి కోసం యజ్ఞం చేస్తుంటే... రాక్షసుల్లా అడ్డుపడుతున్నారు : సీఎం చంద్రబాబు**



**కుప్పం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆరు దశాబ్దాలుగా భూమి కోసం ఎదురుచూస్తున్న కంగుంది గ్రామంలోని 322 కుటుంబాల నిరీక్షణకు ముఖ్యమంత్రి చంద్రబాబు తెర దించారు. తరతరాలుగా సాగుచేస్తున్న భూములకు అధికారిక హక్కు పత్రాలు అందుకోవడంతో లబ్ధిదారుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. కుప్పం నియోజకవర్గంలోని కంగుందిలో నిర్వహించిన డీకేటీ పట్టాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు 460.19 ఎకరాల భూమికి సంబంధించిన పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. పట్టాల పంపిణీకి సంబంధించి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. 61 సంవత్సరాలుగా పరిష్కారం కాకుండా గ్రామస్థులను వేధిస్తున్న భూ సమస్యను సమగ్ర రికార్డుల పరిశీలన, వివిధ కోణాల్లో అధ్యయనం చేసి పరిష్కరించినట్లు తెలిపారు. అడవి పోరంబోకు భూమిని అసైన్డ్ వేస్ట్ డ్రై భూమిగా మార్చేందుకు కేబినెట్ ఆమోదం తీసుకుని రైతులకు భూములు అందించినట్లు చెప్పారు.

### పేదలకు పట్టాల పంపిణీ సంతోషంగా ఉంది

రైతుల పక్షాన న్యాయం ఉండటంతోనే ఈ సమస్యను పరిష్కరించగలిగామని పేర్కొన్న సీఎం, 322 మంది రైతులకు 460.19 ఎకరాల భూమిని పట్టాల రూపంలో ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాల పట్ల ప్రభుత్వ నిబద్ధతకు ఇది నిదర్శనమని చెప్పారు. కంగుంది కోట సాక్షిగా రైతులకు పట్టాలు అందించడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో అనేక రెవెన్యూ, భూ సమస్యలు ఉన్నాయని, ఇటీవల శెట్టిపల్లి భూ సమస్యను పరిష్కరించడం ద్వారా ప్రభుత్వానికి 90 ఎకరాల భూమి దక్కడంతో పాటు రైతులకు కూడా న్యాయం జరిగిందన్నారు. వట్టిచెరుకూరు గ్రామంలో వందల ఏళ్లుగా కొనసాగుతున్న భూ సమస్యను కూడా పరిష్కరించామని, ఇప్పుడు కంగుంది సమస్యకు కూడా శాశ్వత పరిష్కారం చూపినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న భూ వివాదాల పరిష్కారానికి మరో ఏడాది సమయం పట్టే అవకాశముందని పేర్కొన్నారు.

### గూండాయిజానికి తావులేదు

గత ప్రభుత్వ హయాంలో అనేక భూ వివాదాలు సృష్టించారని ఆరోపించిన సీఎం, ప్రజల పట్టాదార్ పాస్ పుస్తకాలపై గత పాలక పార్టీ నేతల ఫొటోలు ముద్రించారని విమర్శించారు. వాటిని తొలగించి రాజముద్రతో కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలను అందజేశామని చెప్పారు. భూ వివాదాల పరిష్కారంలో ఓపికతో వ్యవహరించి అన్ని రికార్డులను పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల భూములకు భద్రత కల్పించేందుకు సాంకేతికతను వినియోగిస్తున్నామని తెలిపారు. కుటుంబ ఆస్తి వివాదాల కారణంగా కూడా అనేక భూములు వివాదాస్పదమవుతున్నాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు, సోదరీమణుల హక్కులను గౌరవించాలని సూచించారు. రౌడీయిజం, గుండాయిజానికి రాష్ట్రంలో తావులేదని స్పష్టం చేసిన ఆయన, పెట్టుబడులు ఆకర్షిస్తూ పరిశ్రమలు తీసుకొస్తున్నామని, కుప్పంలోనే ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. భవిష్యత్తులో కుప్పాన్ని టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేసి మరిన్ని ఉద్యోగ అవకాశాలు సృష్టిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

### అభివృద్ధిని ఆపలేరు... అడ్డుకోలేరు

'కుప్పం ప్రజలంతా సోలార్ విద్యుత్‌కు ప్రాధాన్య మివ్వాలనీ సీఎం అన్నారు. పెట్రోల్, డీజిల్ వినియోగం బదులు సోలార్ విద్యుత్ ఉత్పత్తి ద్వారా ఈ సైకిళ్లు, ఈ వెహికల్స్ వినియోగం పెంచాలనీ సూచించారు. నెట్ జీరో విధానంలో స్వచ్ఛ కుప్పం-స్వర్ణ కుప్పం సాధించాలనీ పిలుపు నిచ్చారు. డ్వాక్రా మహిళలను పారిశ్రామిక వేత్తలుగా ప్రోత్సహిస్తున్నామని.. ఇప్పటికే 1.50 లక్షల మందిని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దామని వివరించారు. డ్వాక్రా మహిళా ఉత్పత్తుల కోసం స్వయం బ్రాండ్ ఏర్పాటు చేశామని..దీని ద్వారా అంతర్జాతీయ స్థాయికి డ్వాక్రా ఉత్పత్తులకు మార్కెటింగ్ వచ్చేలా చేస్తామని తెలిపారు. కుప్పం పొగురుపల్లిలో రూ.9,322 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన 30 ప్రాజెక్టుల అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నట్టు తెలిపారు. గత పాలనలో రాష్ట్రానికున్న బ్రాండ్ పోగొట్టారనీ.. పరిశ్రమలను వెళ్లగొట్టారు. కానీ ఈ రెండేళ్ల కాలంలో పోయిన బ్రాండ్ ను తిరిగి తెచ్చామన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి యజ్ఞం చేస్తుంటే.. గొడ్డలి పార్టీ నేతలు రాక్షసుల్లా అడ్డుపడుతున్నారనీ సీఎం ఆక్షేపించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

### డేటాను సురక్షితంగా ఉంచడం

# ప్రభుత్వ బాధ్యత: ఏపీటీఎస్ ఛైర్మన్




**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రభుత్వ శాఖల్లో అమలవుతున్న సైబర్ సెక్యూరిటీ వ్యవస్థలను సమీక్షించి, రాష్ట్ర ప్రభుత్వ డేటా భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలతో సచివాలయంలో ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీటీఎస్ ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ హాజరయ్యారు. 'రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ వ్యవస్థల్లో సైబర్ సెక్యూరిటీ ఫ్రేమ్‌వర్క్‌ల బలోపేతం' అనే అంశంపై ఈ వర్క్‌షాప్‌లో చర్చించారు. ఈ సందర్భంగా ఏపీటీఎస్ ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ సేవలను వేగంగా డిజిటలైజ్ చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో పౌరుల వ్యక్తిగత సమాచారం, ఆరోగ్య సంబంధిత వివరాలు, విద్య, భూ రికార్డులు, సంక్షేమ పథకాలు, ఆర్థిక లావాదేవీల వంటి అత్యంత కీలకమైన ప్రభుత్వ డేటాను సురక్షితంగా ఉంచడం ప్రభుత్వ బాధ్యతగా మారిందన్నారు. రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ శాఖ ప్రస్తుతం సైబర్ భద్రతను ఏ విధంగా అమలు చేస్తోంది, ఎలాంటి సవాళ్లు ఎదుర్కొంటోంది, వాటిని అధిగమించేందుకు ఎలాంటి ఆధునిక భద్రతా వ్యవస్థలు అవసరమనే అంశాలపై ఈ వర్క్‌షాప్‌లో విస్తృతంగా చర్చించినట్లు పేర్కొన్నారు. అన్ని శాఖల్లో అత్యుత్తమ సైబర్ సెక్యూరిటీ ప్రమాణాలు అమలు చేయడం, డేటా భద్రతను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దడం, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ ఫ్రేమ్‌వర్క్‌ను మరింత బలోపేతం చేయడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశమని వెల్లడించారు.

# తుంగభద్రలో తీవ్ర నీటి కొరత : కాలవ శ్రీనివాసులు

**బొమ్మనహాళ్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది తుంగభద్ర ప్రాజెక్టులో తీవ్ర నీటి కొరత నెలకొందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఖరీఫ్‌లో తుంగభద్ర ఆయకట్టు పరిధిలో సాగునీరు అందించడం అత్యంత క్లిష్టంగా మారిందని అనంతపురం జిల్లా రాయదుర్గంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన తెలిపారు. ప్రస్తుతం తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వ అత్యంత ఆందోళనకర స్థాయిలో 9.80టీఎంసీలు మాత్రమే ఉందన్నారు. గత 60 ఏళ్లలో ఇంత తీవ్ర నీటి కొరత ఎప్పుడూ లేదని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో తుంగభద్ర ప్రాజెక్టు పరిధిలో ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయడం సాధ్యపడే పరిస్థితి కనిపించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# ఎడిటర్ వాయిస్

## మావిగన్ జగన్‌కి సొంత గడ్డ మీద రీ సౌండ్!


ఏపీలో టీడీపీ కూటమి వర్సెస్ వైసీపీగా పొలిటికల్ వార్ తీవ్రతరం అయింది. రెండేళ్ళ కూటమి పాలన పూర్తి అయ్యాక రాజకీయ వేడి ఏపీలో బాగా పెరిగింది. ఇపుడు ఇష్యూ మొత్తం రాజధాని చుట్టూ తిరుగుతోంది. నిజానికి ఈ ఏడాది ఏప్రిల్ మొదటి వారంలో కేంద్ర ప్రభుత్వం ఏపీకి అమరావతి ఏకైక రాజధాని అంటూ చట్టబద్ధత కల్పించింది. ఉభయ సభలూ దానికి ఓకే చెప్పాయి. ఆ మీదట రాష్ట్రపతి రాజ ముద్రతో అమరావతికి అధికారిక రాజధాని హోదా వచ్చేసింది. ఆ మీదట ఆ టాపిక్ క్లోజ్ అని అంతా అనుకున్నారు. కానీ వైసీపీ ఇక్కడే బిగ్ ట్విస్ట్ ఇచ్చింది. మావిగన్ అంటూ గత మూడు నెలలుగా ఇదే అంశం మీద తన వాదన కొనసాగిస్తోంది. మంచికో చెడ్డకో దానిని జనంలో పెట్టి చర్చకు తెర లేపాలని చూస్తోంది.

**కూటమి ఫుల్ అలెర్ట్ :** దీని మీద కూటమి ప్రభుత్వం కూడా అలెర్ట్ గా ఉంది. అందుకే ముఖ్యమంత్రి జిల్లాల పర్యటనలలో అమరావతి గురించి గట్టిగానే చెబుతూ వస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అయితే అమరావతి రాజధాని ఆవసరం గురించి చెబుతూ వస్తున్నారు. తాజాగా కడపలో రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనుల ప్రారంభం కార్యక్రమంలో చంద్రబాబు జై అమరావతి నినాదంతో జనాలను ఆకట్టుకున్నారు. దానికి జగన్ సొంత జిల్లా కడప కూడా జై అంటూ ప్రతిధ్వనించిన నేపథ్యం ఇపుడు రాజకీయంగా హాట్ టాపిక్ అవుతోంది.

**రోజుకో మాట అంటూ :** ఇదిలా ఉంటే జగన్ మీద ఆయన సొంత గడ్డ కడపలోనే చంద్రబాబు ఘాటుగా విమర్శలు చేశారు. జగన్ స్థిరమైన వ్యక్తిత్వం లేకుండా రోజుకో ప్రాంతాన్ని రాజధాని అంటున్నారని బాబు ఫైర్ అయ్యారు. గత పాలకులు విధ్వంసమే అజెండాగా చేసుకుని పనిచేశారని వైసీపీ మీద తీవ్ర విమర్శలు చేశారు. విశ్వసనీయత లేని పార్టీకి విలువలు కూడా లేవని చంద్రబాబువ్యాఖ్యానించారు. అమరావతి రాజధానిగా అంగీకరించి అధికారంలోకి కాగానే మూడు ముక్కలాట ఆడారని బాబు గుర్తు చేసారు.

**కేంద్రం చట్టం చేసినా :** అమరావతిని కేంద్రం చట్టబద్ధంగా రాజధానిగా ప్రకటించింది అని చంద్రబాబు చెప్పారు. అంతలా కేంద్ర చట్టబద్ధతతో అమరావతి రాజధానిగా కొనసాగుతున్నా కూడ జగన్ మావిగన్ అంటూ కొత్త డ్రామాలు మొదలు పెట్టారని బాబు ఆక్షేపించారు. ఆయన మావిగన్ అంటూనే నిన్నటికి నిన్న విజయవాడ అన్నారని రేపు ఏమంటారో తెలీదని బాబు వ్యాఖ్యానించారు. ప్రజలకు కూటమి ప్రభుత్వం నమ్మకంతో విశ్వాసంతో పాలన అందిస్తోందని బాబు చెప్పారు. అందుకే ఏపీకి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని చంద్రబాబు స్పష్టం చేశారు.

**ఆడుకోవద్దు అంటూ :** ఏపీ ప్రజల జల ఆత్మాభిమానంతో ఆటలు ఆడుకోవద్దని జగన్ కి చంద్రబాబు హితవు పలికారు. గత పాలనలో ఏపీకి రాజధాని ఏమిటో ఎక్కడుందో కూడా చెప్పలేని పరిస్థితి ఉందని చంద్రబాబు అన్నారు. మూడు ముక్కలాటతో రాష్ట్రాన్ని మాత్రమే కాదు ప్రజలను సైతం జగన్ తీవ్రంగా నష్ట పరిచారని చంద్రబాబు ఆక్షేపించారు. ఇదిలా ఉంటే తాను రాష్ట్ర ప్రజలంతా గర్వంగా కాలరెగరేసి చెప్పుకునేలా అమరావతి రాజధానిని అభివృద్ధి చేస్తానని బాబు గట్టి భరోసా ఇచ్చారు. జై అమరావతి అని కడప సభ దద్దరిల్లడం విశేషం. మొత్తం మీద మావిగన్ అని నినదించిన జగన్ కి కడపలోనే రీ సౌండ్ వచ్చేలా బాబు చేసినట్లు అయింది అని అంటున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

## పురోహితుడి ప్రాణం తీసిన కొబ్బరి బొండం

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి.. పెళ్లింట విషాదం



**విజయవాడ(చిట్టినగర్), విశ్వం వాయిస్ న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లా జక్కంపూడి పరిధి విజయవాడ బైపాస్‌లో జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు మరణించారు. పురోహితుడితో పాటు మరో వ్యక్తి ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. కారు బ్రేకు, క్లచ్ మధ్య ఓ కొబ్బరిబొండం ఇరుక్కుపోవడం ఈ ప్రమాదానికి కారణం కావచ్చని పోలీసులు చెబుతున్నారు. రాజమహేంద్రవరానికి చెందిన దువ్వూరి హరిప్రసాద్(52) పురోహితుడు. ఆయన చిన్న కుమారుడి వివాహం హైదరాబాద్‌లో గురువారం పెళ్లికుమార్తె ఇంటివద్ద జరిగింది. శుక్రవారం మధ్యాహ్నం కుటుంబసభ్యులు ఒక కారులో, హరిప్రసాద్ ఆయన బంధువు, వెనుక సీట్లో పూజసామగ్రితో మరో కారులో రాజమహేంద్రవరం బయలుదేరారు. విజయవాడ సమీపంలోని నల్లగుంట వద్ద ఆయన బంధువు కారు దిగిపోయారు. గొల్లపూడి బైపాస్ రోడ్డు సమీపంలో కారు అదుపు తప్పి ద్విచక్రవాహనాన్ని, అక్కడే ఆగి ఉన్న కంటెయినర్‌ను ఢీకొట్టింది. ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టినప్పుడు కారు వెనకసీట్లో ఉన్న కొబ్బరిబొండం ఎగిరివచ్చి బ్రేక్, క్లచ్ మధ్య ఇరుక్కోవడంతో కారు అదుపుకాలేదని, అందుకే కంటెయినర్‌ను ఢీకొట్టి ఉండవచ్చని పోలీసులు చెబుతున్నారు. కారు నడుపుతున్న హరిప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందారు.

**కుమారుడి ఇంటికి వెళ్తూ..**

విజయవాడ రాజీవ్‌నగర్‌కు చెందిన సూరిబోయిన గురవయ్య(60) మార్కాపురం జిల్లా చంద్రశేఖరపురం మండలం బోయమడుగుల వీఆర్‌ఏ. అనారోగ్యం కారణంగా గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో శుక్రవారం వైద్యం చేయించుకున్నారు. అక్కడనుంచి తన కుమారుడు హరికృష్ణ ద్విచక్రవాహనంపై విజయవాడ బయలుదేరారు. వాహనం వెనక సీట్లో గురవయ్య కూర్చున్నారు. కారు ఢీకొట్టగానే గురవయ్య ఎగిరి రోడ్డుమీద పడి అక్కడికక్కడే మృతిచెందారు. కుమారుడు శిరస్త్రాణం ధరించడంతో గాయాలతో బయటపడ్డాడు.

## భీంరెడ్డి బినామీలకు పిలుపు..

### మాజీ ప్రజాప్రతినిధి సహా పది మందిపై దృష్టి – నిందితుడి స్వదస్తూరిపై ఏసీబీ అధికారుల ఆరా మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచకపోవడంపై భిన్న వాదనలు



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** పోలీస్‌శాఖలో సంచలనం సృష్టించిన డీఎస్పీ సంకిరెడ్డి భీంరెడ్డి ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో చోటుచేసుకున్న పరిణామాలు కలకలం రేపాయి. అడ్డగోలుగా సంపాదించిన అక్రమార్జనతో అవినీతి నిరోధకశాఖ(ఏసీబీ)కి అడ్డంగా దొరికిన భీంరెడ్డి వ్యవహారం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. అతను అక్రమ సంపాదనను బినామీల పేరిట నమోదు చేయించినట్లు తమకు లభించిన ప్రాథమిక ఆధారాలపై ఏసీబీ లోతుగా ఆరా తీస్తోంది. భీంరెడ్డి తన స్వదస్తూరితో రాసుకున్న వివరాల ఆధారంగా దర్యాప్తును ముందుకు సాగించడంలో ఏసీబీ అధికారులు నిమగ్నమయ్యారు. ఏ స్థిరాస్తి ఎవరి పేరిట రిజిస్టర్ చేశాననే అంశంపై రాసుకున్న వివరాలు ఏసీబీకి లభ్యమైనట్లు తెలుస్తోంది. పది మందికి పైగా ఇలాంటి బినామీలున్నట్లు గుర్తించారని సమాచారం. ఈనేపథ్యంలోనే ఆయా పేర్లతో ఉన్న బినామీలను పిలిచి వాంగ్మూలాలు నమోదు చేయడంపై అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఆ స్థిరాస్తిని ఎలా సంపాదించుకున్నారు? అందుకు మూలాలేంటి? అని ఆరా తీయడం ద్వారా భీంరెడ్డి బినామీలేనని ధ్రువీకరించుకోనున్నారు. మణికొండ ప్రాంతానికి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి గురించి లోతుగా ఆరా తీస్తున్నారు. అతనితో కలిసి భీంరెడ్డి వ్యాపార లావాదేవీలు జరిపినట్లు ప్రాథమికంగా ఆధారాల్ని సేకరించారు. అతను ఎస్సై హోదాలో రాయదుర్గం ఠాణా ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వర్తించిన సమయంలో సదరు నేత అదే ప్రాంతంలో సర్పంచిగా ఉండటంతో ఇద్దరి మధ్య సఖ్యత కుదిరినట్లు అధికారులు గుర్తించారు. వీరిమధ్య భారీగా ఆర్థిక లావాదేవీలు చోటుచేసుకున్నట్లు తెలుస్తుండటంతో ప్రత్యేక దృష్టి సారించారు. మరోవైపు ఓ మహిళ సైతం భీంరెడ్డి బినామీల జాబితాలో ఉన్నట్లు అనుమానిస్తున్న ఏసీబీ.. ఆ దిశగా దర్యాప్తు సాగిస్తోంది.

**అస్వస్థతతో ఆసుపత్రికి.. నోటీసుతో సరి**

ఆదాయానికి మించిన ఆస్తుల వ్యవహారంలో భీంరెడ్డిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచకపోవడం కలకలం రేపింది. సాధారణంగా ఎవరైనా ఏసీబీకి చిక్కితే అరెస్టయిన 24 గంటల్లోపు మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరుస్తారు. గురువారం ఉదయం ఏసీబీ అధికారులు భీంరెడ్డి ఇంటికి వెళ్లగానే అతను తీవ్ర ఆందోళనకు లోనైనట్లు అనధికారిక సమాచారం. ఈక్రమంలోనే రక్తపోటు అధికం కావడంతో గురువారం రాత్రి సమయంలోనే అతన్ని ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది. ఆరోగ్యం కుదుటపడకపోవడంతో అరెస్ట్ నోటీసుతో సరిపెట్టినట్లు సమాచారం. అనారోగ్యం కారణంగానే న్యాయస్థానానికి తరలించలేదంటూ ఏసీబీ కేసుల్లో ఇలా నోటీసులతో సరిపెట్టడం అరుదు. అదీ భీంరెడ్డి విషయంలో చోటుచేసుకోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

## ఒకే ఇంట్లో ముగ్గురు మహిళల బలవన్మరణం

**గూడూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** కృష్ణాజిల్లా గూడూరు మండలం అనంతాయిపేటలో విషాద ఘటన చోటు చేసుకుంది. ఒకే ఇంట్లో ముగ్గురు మహిళలు బలవన్మరణానికి పాల్పడటం కలకలం రేపింది. అత్త రజని (60, కుమార్తె గౌరి (40), కోడలు మధు(35) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మహిళల మృతికి కుటుంబ కలహాలే కారణమని స్థానికులు భావిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసిన గూడూరు పోలీసుల దర్యాప్తు చేస్తున్నారు.

### ఆరో అంతస్తు నుంచి దూకి

## ట్రిపుల్ ఐటీ విద్యార్థి ఆత్మహత్య



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** గచ్చిబౌలి ట్రిపుల్ ఐటీలో అభిరూప్ (20) అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆరో అంతస్తు నుంచి కిందికి దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం బయ్యారం గ్రామానికి చెందిన అభిరూప్ ట్రిపుల్ ఐటీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ఓ వైపు చదువు ఒత్తిడి, మరోవైపు అనారోగ్య సమస్యలు ఎక్కువ కావడంతో.. తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. ఆరో అంతస్తు నుంచి దూకడంతో తీవ్ర గాయాలపాలై అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు అక్కడి వారు చెబుతున్నారు. సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు సంఘటన స్థలికి చేరుకొని వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

## భార్యపై అనుమానం.. కత్తితో పొడిచి చంపిన భర్త




**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉప్పల్ పోలీసు స్టేషన్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. ఆదర్శ నగర్‌లో సురేశ్ తన భార్య జెస్సికాను కత్తితో పొడిచి హత్య చేశాడు. నర్సుగా పని చేస్తున్న భార్యపై కొంతకాలంగా అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఇవాళ ఉదయం జెస్సికాను హత్య చేసి.. అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికుల నుంచి సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని.. మృతదేహాన్ని పోస్టుమార్ట నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. పరారీలో ఉన్న సురేష్ కోసం గాలిస్తున్నారు.

### కాలితో తన్నిన వ్యక్తి..

## లారీ కింద పడి యువకుడి దుర్మరణం

**కోదాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** సూర్యాపేట జిల్లా కోదాడలో ఇటీవల మరణించిన ఓ యువకుడి కేసులో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. మహేష్ అనే వ్యక్తి కాలితో తన్నడంతో యువకుడు లారీ కింద పడి మరణించినట్లు తేలింది. పోలీసుల కథనం ప్రకారం.. కోదాడలో ఖమ్మం క్రాస్ రోడ్డు వద్ద జూన్ 30న ముగ్గురు మిత్రులు బార్‌లో మద్యం తాగడానికి వెళ్లారు. ఈక్రమంలో రమేష్, మహేష్ మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. వారిని ఆపేందుకు యాకూబ్ ప్రయత్నించాడు. రమేష్‌కు మద్దతుగా మాట్లాడుతున్నాడని యాకూబ్‌ను మహేష్ దూషించాడు. అనంతరం రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న యాకూబ్‌ను మహేష్ కాలితో తన్నాడు. దీంతో నియంత్రణ కోల్పోయిన అతడు లారీ కింద పడి తీవ్రగాయాల పాలయ్యాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈఘటనను రోడ్డు ప్రమాదంగా భావించిన పోలీసులు తొలుత లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడు తన తప్పేం లేదని చెప్పడంతో అధికారులు సీసీటీవీ ఫుటేజీ సేకరించారు. దీంతో అసలు విషయం వెలుగుచూసింది. నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# విశ్వం వాయిస్

అవినీతిపై - అక్షర సమరం...

VISWAMVOICE TELUGU DAILY

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు

ఆదివారం, 05 జూలై, 2026








www.viswamvoice.com

సత్యం • సమగ్రం • సమాజ బాధ్యత    www.viswamvoice.com


# CEIRతో కాకినాడ పోలీసుల సూపర్ సక్సెస్..!

## రూ.1.20 కోట్ల విలువైన 602 మొబైళ్లను బాధితుల చేతికి



12వ విడతలో 602 మొబైళ్లు స్వాధీనం
విలువ రూ.1,20,40,000

మొత్తం రికవరీ (ఇప్పటివరకు) 4,603 మొబైళ్లు
మొత్తం విలువ రూ.7,68,67,000

- 12వ విడతలో భారీ రికవరీ.. ఇప్పటివరకు 4,603 మొబైళ్ల స్వాధీనం
- రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచిన కాకినాడ జిల్లా పోలీస్ యంత్రాంగం
- బాధితులకు మొబైల్ ఫోన్లు అందజేసిన ఎస్పీ జి. బిందు మాధవ్

**కాకినాడ, విశ్వం వాయిస్ క్రైమ్ న్యూస్ :** పోగొట్టుకున్న లేదా చోరీకి గురైన మొబైల్ ఫోన్లను తిరిగి స్వాధీనం చేసి యజమానులకు అందజేసే ప్రక్రియలో కాకినాడ జిల్లా పోలీసులు మరోసారి విశేష ఫలితాలు సాధించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, సైబర్ నిఘా, సమర్థవంతమైన దర్యాప్తుతో భారీ స్థాయిలో మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్, ఐపీఎస్ ప్రత్యేక పర్యవేక్షణలో నిర్వహించిన 12వ విడత సిఇఐఆర్ మొబైల్ రికవరీ కార్యక్రమంలో రూ.1,20,40,000 విలువైన 602 మొబైల్ ఫోన్లను వాటి యజమానులకు అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బాధితులకు ఎస్పీ స్వయంగా మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు.





**సాంకేతికతతో సాధ్యమైన భారీ రికవరీ**

జిల్లా ఐటీ కోర్ బృందం సిఇఐఆర్ పోర్టల్‌లో నమోదైన ఫిర్యాదులను విశ్లేషించి ఐఎంఇఐ ట్రాకింగ్, జిపిఎస్ ఆధారిత గుర్తింపు, డిజిటల్ ఫోరెన్సిక్ విశ్లేషణ, సైబర్ నిఘా, డేటా అనాలిసిస్ వంటి అత్యాధునిక సాంకేతిక విధానాలను వినియోగించి మొబైల్ ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకుంది. ఇప్పటివరకు నిర్వహించిన 12 విడతల్లో మొత్తం 4,603 మొబైల్ ఫోన్లను రికవరీ చేయగా, వాటి మొత్తం విలువ రూ.7,68,67,000గా నమోదైంది. మొబైల్ రికవరీలో రాష్ట్ర స్థాయిలో కాకినాడ జిల్లా విశేష ప్రతిభ కనబరుస్తోందని ఎస్పీ వెల్లడించారు.

**సిఇఐఆర్ సేవలను వినియోగించుకోవాలి**

మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వెంటనే సిఇఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయడం ద్వారా తిరిగి పొందే అవకాశం మెరుగవుతుందని ఎస్పీ తెలిపారు. సైబర్ మోసాలకు గురైన వారు 1930 సైబర్ హెల్ప్‌లైన్ను సంప్రదించాలని లేదా అధికారిక సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు.

**మొబైల్ పోగొట్టుకున్న వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

సిఇఐఆర్ పోర్టల్‌లో వెంటనే ఫిర్యాదు నమోదు చేయాలి.

బ్యాంకు ఖాతాలు, యుపిఐ సేవలను తాత్కాలికంగా భద్రపరచాలి.

సిమ్ కార్డును వెంటనే బ్లాక్ చేయించాలి.

గూగుల్, యాపిల్ ఐడి, వాట్సాప్, బ్యాంకింగ్ యాప్‌లు, సోషల్ మీడియా ఖాతాల పాస్‌వర్డ్‌లను మార్చాలి.

యాండ్రాయిడ్‌లో ఫైండ్ మై డివైజ్, ఐఫోన్‌లో ఫైండ్ మై ఐఫోన్ సేవలను వినియోగించాలి.

**సెకండ్ హ్యాండ్ మొబైల్ కొనుగోలు చేసేవారికి సూచనలు**

మొబైల్ కొనుగోలుకు ముందు బిల్లు, బాక్స్, ఐఎంఇఐ నంబర్‌ను తప్పనిసరిగా పరిశీలించాలి.

అపరిచితుల వద్ద నుంచి మొబైల్ ఫోన్లు కొనుగోలు చేయకుండా అప్రమత్తంగా ఉండాలి.

తక్కువ ధర పేరుతో అనుమానాస్పద మొబైళ్లను కొనుగోలు చేయరాదు.

**సిబ్బందికి ప్రశంసలు**

మొబైల్ రికవరీలో కీలక పాత్ర పోషించిన జిల్లా ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ డి. దుర్గా శేఖర్ రెడ్డితో పాటు ఐటీ కోర్ బృందం, డీసీఆర్‌బీ, పీసీఆర్ అధికారులు, సంబంధిత డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు, మొబైల్ రికవరీ బృంద సభ్యులను ఎస్పీ అభినందించారు.

# కానవరం చెరువుల అక్రమ లీజులపై దళితుల ఆందోళన

**చెరువులను బయటి వ్యక్తులకు లీజుకు ఇచ్చి లక్షల రూపాయలు వసూలు**

**చేపల వేట నిలిపివేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని - పోలీసులకు ఫిర్యాదు చేసిన గ్రామస్థులు**



**రాజానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజానగరం మండలం కానవరం గ్రామానికి చెందిన ఎస్సీ (మాల) సామాజిక వర్గానికి చెందిన గ్రామస్థులు గ్రామ పరిధిలోని ప్రభుత్వ చెరువుల అక్రమ లీజుల వ్యవహారంపై రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి వివరాల ప్రకారం, కానవరం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఫిషర్‌మెన్ సొసైటీకి సంబంధించిన చెరువులకు ప్రస్తుతం ఎలాంటి గుర్తింపు పొందిన ఫిషర్‌మెన్ సొసైటీ లేదని తెలిపారు. అయినప్పటికీ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఎంపీటీసీ ఒక వీఆర్వో కలిసి ప్రభుత్వ అనుమతులు, పంచాయతీ లీజులు లేదా ఇతర చట్టబద్ధ అనుమతులు లేకుండానే చెరువులను బయటి వ్యక్తులకు లీజుకు ఇచ్చి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని వారు ఆరోపించారు. ఇటీవల దావరపల్లి ప్రాంతానికి చెందిన వ్యక్తులు చింతాగొయ్యి చెరువులో చేపలవేట చేపట్టగా, గ్రామస్థులు అడ్డుకోవడంతో తమ వద్ద లీజు ఉందంటూ కొందరు వ్యక్తులు ఇచ్చిన తప్పుడు పత్రాలను చూపించారని వాపోయారు. అయితే ప్రస్తుతం ఆ చెరువులకు ఎలాంటి చెల్లుబాటు అయ్యే లీజులు లేవని గ్రామస్థులు పేర్కొన్నారు. గ్రామంలో కొత్త ఫిషర్‌మెన్ సొసైటీ ఏర్పాటు చేసే ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో, ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండా చెరువులను లీజుకు ఇచ్చిన వారిపైనా, అక్రమంగా చేపల వేట చేపడుతున్న వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు పోలీసులను కోరారు. వారిని పట్టుకొని పోలీసులకు అప్పగించిన ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పై వారు ఆందోళన వ్యక్తం చేశారు. వారిపై ఇప్పటివరకు ఎటువంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం పట్టుకున్న సామాగ్రిని వదిలివేయడం పట్ల విచారం వెలిబుచ్చారు. వారికి పోలీసులు మద్దతు పలకడంతో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని వారు తెలిపారు. అలాగే ఈ వ్యవహారంలో గ్రామంలో ఎలాంటి ఉద్రిక్తతలు లేదా సామాజిక విభేదాలు తలెత్తకుండా ఉన్నత అధికారులు వెంటనే జోక్యం చేసుకుని అక్రమాలను అరికట్టాలని దళిత గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. పి.సూరిబాబు, డి.నరసింహమూర్తి, డి.వెంకన్న, కె.గణపతి, కె.సుబ్బారావు, డి.నాగేశ్వరరావు, కె.పోతయ్య, పి.సుబ్బారావు, ఎం.వెంకన్న, డి.నారాయుడు, కె.ఏరోదు, కె.దొర, ఎం.రాజు, ఎం.సత్యనారాయణ, ఎం.నందిబాబు, కె.రాఘవ, డి.చిన్నోడు తదితరులు పాల్గొన్నారు.

# నేటి తరం యువత అల్లూరి పోరాట స్ఫూర్తిని కొనసాగించాలి

**అఖిలపక్షం, ఏపీ ఆదివాసీ జేఏసీ పిలుపు**

**అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన నాయకులు**



**దేవీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** పోలవరం జిల్లా, రంపచోడవరం నియోజకవర్గం, దేవీ పట్నం మండల పరిధిలోని ఇందుకూరు గ్రామంలో అల్లూరి సీతారామరాజు 130వ జయంతి సందర్భంగా ఘనంగా పూల మాలలు వేసి నివాళులు అర్పించిన అఖిలపక్షం,ఏపీ ఆదివాసీ జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా తెల్లం శేఖర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన సమరయోధుడు అల్లూరి సీతారామరాజు ఆనాడు రంప ప్రాంతంలో ఇటువంటి కమ్యూనికేషన్, చదువు లేని ఆదివాసీ ప్రజలకు జరుగుతున్న అక్రమాలు, అన్యాయాలపై ప్రజలను చైతన్యం చేసి భారతదేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ వాళ్ళని భారతదేశం నుండి తరిమికొట్టడంలో కీలకపాత్ర వహించారన్నారు. వీరితోపాటు గాం గంట దొర, గాం మల్లు దొర, మ్రి కామయ్య మొదలైన వారు ఎందరో పాల్గొని ప్రాణ త్యాగం చేశారన్నారు.మన్యం వీరుల్లో ఒకరైన అల్లూరి సీతారామరాజు నేటి తరం యువతీ యువ కులకు స్ఫూర్తిదాయకమన్నారు. అల్లూరి పోరాట స్ఫూర్తితో నేటితరం యువతీ యువకులు ఆది వాసీలపై జరుగుతున్న అన్యాయులపై, చట్టాలు హక్కులపై జరుగుతున్న దాడులపై ఆదివాసీలంత ఐక్యంగా మరో మలిదశ శాంతియుత ఉద్యమానికి సిద్ధం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్య క్రమంలో ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కారం రామన్న దొర, ఏపీ ఆదివాసీ జేఏసీ మండల కార్యదర్శి యలగాడ నాగేశ్వరరావు, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి అయినాల శ్రీనివాసు, ఆది వాసి మహాసభ జిల్లా అధ్యక్షులు మడకం బంగారు బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి అరగటి వీర భద్రారెడ్డి, అరగటి నాగిరెడ్డి, కెచ్చెల ముద్దుల రెడ్డి, పచ్చుకూరి గౌరీ శంకర్, పచ్చుకూరి అర్జు నుడు, మూలెం బుచ్చిరాజు, బండారి వీరబాబు, కోనపర్తి ప్రసాద్, మాలపర్తి ఈసు, మన్నేపల్లి కోటి, కొట్టెం బన్నీ, మాదాల షణ్ముఖ, ఈరేటి యువ కిరణ్ మొదలైన వారు పాల్గొన్నారు.

భద్రందొర ఆధ్వర్యంలో

# అల్లూరి 139వ జయంతి నివాళులు



**నిడదవోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** శనివారం ఉదయం నిడదవోలు నియోజకవర్గం కోఆర్డినేటర్ మేడవరపు భద్రం దొర ఆధ్వర్యంలో స్వర్గీయ విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు 139వ జయంతి,మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతిని పురస్కరించుకొని గాంధీనగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి స్వీట్లు బిస్కెట్లు పురవీధుల్లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భద్రం దొర మాట్లాడుతూ 200 సంవత్సరాలు మన దేశాన్ని పరిపాలించిన ఆంగ్లేయులను మట్టి కరిపించిన వ్యక్తి అల్లూరి సీతారామరాజు అని ఇలాంటి వారు పుట్టిన దేశంలో మనం కూడా పుట్టడం ఒక అదృష్టంగా భావిస్తున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు చిన్నం మురళీకృష్ణ, బండి అభి శక్తుడు,మహమ్మద్ అన్వర్ ఖాన్, కాకి కిషోర్,మురళి తదితరులు పాల్గొన్నారు.






# అల్లూరి జయంతి సందర్భంగా నివాళులర్పించిన పోలీసు అధికారులు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు స్వాతంత్ర్య సమరయోధుడు మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 129 వ జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి డి.ఎస్.పి (ఎస్.బి)బి. రామకృష్ణ, ఇతర పోలీసు అధికారులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా డిఎస్పీ రామకృష్ణ మాట్లాడుతూ మన్యంలో పోరాట వీరులను తీర్చిదిద్ది.. బ్రిటీష్ సామ్రాజ్యానికి ఎదురు నిలిచిన అల్లూరి సీతారామరాజు జీవితం ప్రతిఒక్కరికీ స్ఫూర్తిదాయకం అని అన్నారు. భారత స్వాతంత్ర్య చరిత్రలో ఒక మహోజ్వల శక్తి అల్లూరి అని, ఆయన జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయం అని అన్నారు. సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్ర్యం వస్తుందని నమ్మి దాని కొరకే ప్రాణాలు అర్పించిన యోధుడు అని ఆయనను స్మరించుకున్నారు. అల్లూరి సీతారామరాజు త్యాగం, ధైర్యసాహసాలు మరియు దేశభక్తి నేటి యువతకు ఆదర్శప్రాయమని, ఆయన స్ఫూర్తితో యువతరం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి(ఏ.ఆర్) టి.వి.ఆర్.కె.రవి కుమార్, డి.ఎస్.పి (ట్రాఫిక్) వై.శ్రీకాంత్, డి.ఎస్.పి (క్రైమ్స్) ఏ.సుభాష్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
VISWAMVOICE TELUGU DAILY
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్
ఆదివారం, 05 జూలై 2026
www.viswamvoice.com





### మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆశయ సాధనకు

# ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

## జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు, విప్లవ జ్యోతి అల్లూరి సీతా రామరాజు 129వ జయంతి వేడుకలను శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో అల్లూరి సీతారామరాజు జరిపిన పోరాటం చిరస్మరణీయమన్నారు. బ్రిటిష్ వారి నిరంకుశ పాలనకు, గిరిజనులపై జరిగిన అన్యాయాలకు వ్యతిరేకంగా చిన్న వయసులోనే ఆయన విప్లవ శంఖం పూరించారని పేర్కొన్నారు. మన్యం ప్రజల హక్కుల కోసం, మాతృభూమి విముక్తి కోసం తన ప్రాణాలను సైతం పణంగా పెట్టిన ధీరుడు అల్లూరి అని కొనియాడారు. అల్లూరి యువతకు స్ఫూర్తిప్రదాత అని, ఆయన చూపిన దేశభక్తి, ధైర్యసాహసాలు నేటి యువతకు ఆదర్శమని తెలిపారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ దేశ ప్రగతికి ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. గిరిజనుల అభ్యున్నతికి అల్లూరి చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. మన్యం ప్రజల సంక్షేమం కోసం పోరాడిన అల్లూరి ఆశయాలకు అనుగుణంగా జిల్లాలోని గిరిజన ప్రాంతాల అభివృద్ధికి, వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మహనీయుల త్యాగాలను స్మరించుకోవడమే కాకుండా వారు ఆశించిన సమాజ నిర్మాణం కోసం నిరంతరం శ్రమించడమే వారికి అర్పించే నిజమైన నివాళి అని కలెక్టర్ అన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోం నైదియా దేవి మాట్లాడుతూ అల్లూరి సీతా రామరాజు గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా అసమాన పోరాటం సాగించిన మహనీయుడని అన్నారు. ఆయన జీవితగాథ దేశభక్తి, త్యాగం, నిబద్ధత, ధర్మబద్ధమైన పోరాటానికి చిరస్మరణీయ నిదర్శనమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన అల్లూరి సీతారామరాజు వంటి మహనీయుల స్ఫూర్తిని భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని చెప్పారు. ముఖ్యంగా యువత ఆయన ఆదర్శాలను ఆచరణలో పెట్టుకుని సమాజ సేవ, దేశ సేవ పట్ల అంకితభావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రజల సంక్షేమం, సామాజిక న్యాయం, ధైర్యసాహసాలు, సేవాతత్వం వంటి విలువలు అల్లూరి జీవితంలో ప్రతిఫలించాయని తెలిపారు. ఆయన జయంతి సందర్భంగా ప్రజలందరూ జాతీయ చైతన్యాన్ని మరింత బలోపేతం చేసుకుని దేశ అభ్యున్నతికి తమ వంతు పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ వి.సుబ్బారావు, కలెక్టరేట్ ఏవో నాగలక్ష్మమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### అమలాపురం రెవెన్యూ డివిజనల్ అధికారిగా

## ఎ.సరళావతికి పూర్తి అదనపు బాధ్యతలు



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ జారీ చేసిన అధికారిక ఉత్తర్వుల మేరకు అమలాపురం రెవెన్యూ డివిజనల్ అధికారిగా ఎ.సరళావతికి పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. ప్రస్తుతం రామచంద్రపురం రెవెన్యూ డివిజనల్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఆమెకు, ఆ బాధ్యతలతో పాటు అదనంగా అమలాపురం డివిజన్ బాధ్యతలను కూడా అప్పగిస్తూ జిల్లా యంత్రాంగం నిర్ణయం తీసుకుంది. పరిపాలనా పరమైన అవసరాల దృష్ట్యా, విధులను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలుగా కలెక్టర్ ఈ ఉత్తర్వులను జారీ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ఎ.సరళావతి అమలాపురం రెవెన్యూ డివిజనల్ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలలో కొనసాగుతారని కలెక్టర్ తన ఉత్తర్వులలో స్పష్టం చేశారు. రామచంద్రపురం అధికారిగా సుదీర్ఘ అనుభవం ఉన్న ఆమె, ఇకపై అమలాపురం డివిజన్ పరిధిలోని ప్రభుత్వ సంక్షేమ పథకాలు, భూసంబంధిత వ్యవహారాలు మరియు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటూ పర్యవేక్షిస్తారని రెవెన్యూ వర్గాలు వెల్లడించాయి.

## రేపు 'డయల్ యువర్ అమలాపురం ఎమ్మెల్యే'



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మన అమలాపురం నియోజకవర్గంలో మీకు ఏమైనా సమస్యలు ఉంటే వాటిని నేరుగా మీూ అయితాబత్తుల ఆనందరావుకు చెప్పేలా 'డయల్ యువర్ ఎమ్మెల్యే' కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఈ నెల 5న (ఆదివారం) ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు 9989638567 నంబర్కు ఫోన్ చేసి, నేరుగా ఎమ్మెల్యేతో మాట్లాడొచ్చు.

## అమలాపురంలో బిఎల్ఎలకు పినిపే అవగాహన




**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురంలో వైసీపీ ఆధ్వర్యంలో ఉప్పలగుప్తం, అల్లవరం మండలాల బూత్ లెవల్ ఏజెంట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. నియోజకవర్గ కో-ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఓటర్ల జాబితా పరిశీలన, చేర్పులు, మార్పుల ప్రక్రియపై దిశానిర్దేశం చేశారు. పార్టీ బూత్ స్థాయి వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఏజెంట్లు చురుకుగా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు.

## ముమ్మిడివరం కోర్టు ఆవరణలో ఘనంగా వనమహోత్సవం

### పచ్చదనం-పరిశుభ్రతతోనే పర్యావరణ పరిరక్షణ



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉత్తర్వులు, రాజమండ్రి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు ముమ్మిడివరం జూనియర్ సివిల్ జడ్జ్ మరియు జూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ముమ్మిడివరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు రామాయణం మనేశ్వరరావు నేతృత్వంలో జరిగిన ఈ పచ్చదనం పెంపొందించే కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని కోర్టు ఆవరణ అంతటా నీడను, ఫలాలను ఇచ్చే వివిధ రకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్య నివారణకు, భావితరాల మనుగడకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. కోర్టు ప్రాంగణాన్ని పచ్చటి వనంగా తీర్చిదిద్దేందుకు సిబ్బంది అంతా కృషి చేయాలని ఆకాంక్షించిన ఈ కార్యక్రమంలో కోర్టు సూపరెండింట్ ఎం.దుర్గారావు, సీనియర్ న్యాయవాది కోన వెంకట శ్రీనివాసరావు, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ కాశి సిద్ధార్థ కుమార్, జనరల్ సెక్రెటరీ పీ.వీ.ఎస్.ఎన్ మూర్తి, ప్రముఖ న్యాయవాదులు జి.వి.రామారావు, గుత్తుల శ్రీనివాసరావు, ఇ.ఎస్. బాబు, మీర్జా అలీ హస్సన్, కె.ఎల్.వి. ప్రసాద్ రావు, ముదే వెంకట్రావు, ఏ.వలియా బాబా, పలివెల నరేష్, మట్ట రమ్యలతో పాటు కోర్టు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## క్వాయర్ కాంక్లేవ్ విజయవంతం చేయండి : కలెక్టర్



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఈనెల 16, 17 తేదీల్లో అంబేద్కర్ కోనసీమ జిల్లా అనాతవరంలో జరిగే క్వాయర్ కాంక్లేవ్ వర్క్షాప్ను అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని కలెక్టర్ ఆర్.మహేశ్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్లో నిర్వహించిన సన్నద్ధత సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వర్క్షాప్ ప్రచార పత్రికను ఆవిష్కరించిన కలెక్టర్ జిల్లాలో కొబ్బరి పరిశ్రమలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

## అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



**అమలాపురం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** మద్యం షాపు సమీపంలో వాంతులు చేసుకుంటూ పడి ఉండి అమలాపురంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం గోకరకొండ వీర వెంకట సత్య రామచంద్ర భాస్కర్(29) మృతి చెందడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అమలాపురం పట్టణ ఎస్సై నరహరిశెట్టి కిషోర్ బాబు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు అమలాపురం రూరల్ మండలం నల్లమిల్లి గ్రామానికి చెందిన గోకరకొండ ఆదినారాయణ రెండో కుమారుడైన భాస్కర్ జనసేన మండల శాఖ అధ్యక్షుడు లింగోలు పండు వద్ద గత కొంతకాలంగా కారు డ్రైవర్ గా పని చేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం అమలాపురంలోని ఒక వైన్ షాపు సమీపంలో భాస్కర్ అపస్మారక స్థితిలో వాంతులు చేసుకుంటూ కనిపించడంతో అతని స్నేహితుడు సోదరుడైన నరేష్ కు ఫోన్ చేసి సమాచారం అందించారు. అవివాహితుడైన భాస్కర్ అప్పటికే అపస్మారక స్థితికి చేరుకోవడంతో హుటా హుటీన తొలత ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి ఉన్నత వైద్యం నిమిత్తం మరో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. భాస్కర్ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. తండ్రి ఆదినారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అమలాపురం పట్టణ పోలీసులు ఆసుపత్రి వద్దకు చేరుకుని వివరాలు సేకరించారు. భాస్కర్ మృతిపై ఎవరిపైన తమకు అనుమానాలు లేవని అయితే ఈ కేసులో విచారణ జరిపి తమ కుటుంబానికి న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆదినారాయణ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్సై కిషోర్ బాబు తెలిపారు.

## రంగా జయంతి సందర్భంగా అమలాపురంలో ఘన నివాళులు



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** పేద ప్రజల ముద్దుబిడ్డ, స్వర్గీయ వంగవీటి మోహన రంగా 79వ జయంతి సందర్భంగా అమలాపురం నల్లవంతెన సమీపంలో ఉన్న ఆయన విగ్రహానికి వైఎస్సార్సీపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వంగవీటి మోహన రంగా ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన గొప్ప ప్రజానాయకుడని కొనియాడారు. ఆయన ఆశయాలు, సేవాస్ఫూర్తి నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. రంగా ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు వంటెద్దు వెంకన్ననాయుడు, తోరం గౌతమ్ రాజా, జడ్పీటీసీ పందిరి హరి, జిల్లెల రమేష్, కల్వకోలను ఉమా, మిండగుదిటి శిరీష్, సలాది గుప్పేశ్వరరావు, అనిల్, రోళ్ల కృష్ణ తదితరులు పాల్గొని రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## వంగవీటి మోహన్ రంగా జయంతి సందర్భంగా ఘననివాళి



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మామిడి కుదురు మండలం బి.దొడ్డవరం గ్రామంలోని ఈరోజు కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన్ రంగా జయంతి సందర్భంగా మామిడి కుదురు కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు అప్పన శ్రీరామకృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో. జిల్లా ఐఎన్టీయూసీ అధ్యక్షులు నీతి పూడి బాల సత్యనారాయణ, మండల వైస్ ప్రెసిడెంట్ బత్తుల సురేష్ బాబు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వాకపల్లి రాంబాబు, వానరాసి దుర్గారావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## జనసేన పార్టీ దరఖాస్తుల స్వీకరణకు విశేష స్పందన

### పదవుల కోసం ఆశావాహుల సందడి



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** 6వ రోజు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పార్లమెంట్ 7 నియోజకవర్గాల నుండి జనసేన పార్టీ నిర్మాణ సాధకుల సమాచార సేకరణ కమిటీ సభ్యులతో కలిసి జన సైనికుల నుండి దరఖాస్తులను అమలాపురం పార్లమెంటు పరిశీలకులు, ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు స్వీకరించారు. అమలాపురం పార్లమెంట్ పరిధిలో జరిగిన జనసేన సారదుల నుండి దరఖాస్తులు స్వీకరణ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాల నుండి వందలాదిమంది జనసేన పార్టీ ఆశావాహులు కార్యక్రమంలో పాల్గొని తమ అభ్యర్థనలను అమలాపురం పార్లమెంటు పరిశీలకుడు, విశాఖ ఉమ్మడి రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబుకి అందజేశారు. అమలాపురం పట్టణంలోని శ్రీ సత్యనారాయణ గార్డెన్స్ లో ఉత్సాహంగా జరిగిన కార్యక్రమం ఉదయం నుండి సాయంత్రం 6 వరకు సందడిగా సాగింది. పండగ వాతావరణంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో గోదావరి జిల్లాల అభిమానం ఆప్యాయతలు వెల్లి విరిసాయి. జనసేన పార్టీ అధినేత ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాజకీయాల్లో ఎన్నడూ లేని విధంగా కార్యకర్తల నుండే నాయకులు తయారు కావాలన్న దృఢ సంకల్పంతో చేపట్టిన జనసేన సారధుల కార్యక్రమం చాలా గొప్పదని నాయకులు, కార్యకర్తలు వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమం జనసేన శ్రేణులే కాకుండా మొత్తం రాష్ట్ర ప్రజలలోను ఆసక్తిని రేకెత్తిస్తుందని పేర్కొన్నారు. రాజకీయాలు పారదర్శకంగా నిజాయితీగా ఉండాలన్నదే పవన్ కళ్యాణ్ సంకల్పమని పలువురు నాయకులు కార్యకర్తలు తెలిపారు. ఇక పార్టీ పరిశీలకుడుగా వచ్చిన పంచకర్ల రమేష్ బాబు ఓర్పు, నేర్పు,సమయస్ఫూర్తి, జనసేన పార్టీ పట్ల కార్యకర్తలు, నాయకులు పట్ల ఆయనకు గల అభిమానం వెలకట్టలేనిదని, అమలాపురం పార్లమెంటు పరిధిలోని పలువురు నాయకులు తెలిపారు. అలసట లేకుండా ఉదయం నుండి సాయంత్రం వరకు కార్యకర్తల నుండి దరఖాస్తులు స్వీకరించడమే కాకుండా అందరితోనూ ఆప్యాయంగా అభిమానంగా మాట్లాడి ప్రోత్సహించారని జనసేన నాయకులు తెలిపారు. జనసేన సైనికులకు పలు విధాలుగా సలహాలు సూచనలు ఇచ్చి ప్రోత్సహించారని వెల్లడించారు. మరోవైపు జనసేన నాయకులు కార్యకర్తలు శనివారం కూడా భారీ ఎత్తున వినతులు సమర్పించుకున్నారు. పార్టీ కోసం పనిచేసిన వారితోపాటు పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న జనసైనికులు తమ అభ్యర్థనలను ఎమ్మెల్యే రమేష్ బాబుకి అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నిర్మాణ సాధకుల సేకరణ కమిటీ సభ్యులు సీనియర్ నాయకులు గెడ్డం మహాలక్ష్మి ప్రసాద్,ఆర్డీఎస్ ప్రసాద్, గనిశెట్టి నాగలక్ష్మి, జనసేన పార్టీ సాదక్ రిప్రజెంటేటివ్స్ చిక్కం సుధారాణి, గిడ్డి రత్నశ్రీ, సంపతి సత్యనారాయణ, వీరితోపాటు 21 మంది నిర్మాణ సాధకుల సమాచార సేకరణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### వంగవీటి మోహనరంగా జయంతి సందర్భంగా

## ఘన నివాళులర్పించిన పినిపే శ్రీకాంత్



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం పట్టణంలో దివంగత ప్రజానాయకుడు వంగవీటి మోహనరంగా జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి అమలాపురం నియోజకవర్గ వైసీపీ కో-ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన ప్రజానాయకుడు వంగవీటి మోహనరంగా అని కొనియాడారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలిచి సేవా భావంతో పనిచేసిన ఆయన ఆశయాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సమాజంలో సేవాభావంతో ముందుకు సాగుతూ మహనీయుల ఆశయాలను కొనసాగించడమే వారికి అందించే నిజమైన నివాళి అని అన్నారు. అనంతరం రంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐటీ విభాగ అధ్యక్షులు తోరం గౌతం, కల్వకొలను ఉమా, ముత్తబత్తుల సంతోష్, కుంచె స్వామి, కొటుం లోవరాజు, బడుగు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## అమలాపురంలో భారీ వర్షం

### ఒక్కసారిగా మారిన వాతావరణం




**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురంలో శనివారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. దట్టమైన మేఘాలు కమ్ముకోవడంతో పాటు ఈదురు గాలులు బలంగా వీచి, అనంతరం భారీ వర్షం కురిసింది. ఆకస్మికంగా కురిసిన వర్షంతో రోడ్లపై వెళ్తున్న ప్రజలు వర్షం నుంచి తలదాచుకునేందుకు పరుగులు తీశారు. ఈదురు గాలుల కారణంగా పలు ప్రాంతాల్లో వాహనదారులు అప్రమత్తంగా ప్రయాణించారు. కొద్దిసేపటికే ప్రధాన రహదారులపై వర్షపు నీరు నిలిచి, ట్రాఫిక్ నెమ్మదించింది. గత కొన్ని రోజులుగా ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఈ వర్షం కొంత ఉపశమనం కలిగించినప్పటికీ, ఈదురు గాలులతో కూడిన వర్షం కారణంగా సాధారణ జనజీవనం కొద్దిసేపు అస్తవ్యస్తమైంది.

### అల్లూరి ఆశయాలను

## ఆచరణలోకి తీసుకురావాలి

### ఎస్పీ రాహుల్ మీనా



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్, అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు త్యాగం, ధైర్యసాహసాలు భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేసిన పోరాటం భావితరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. దేశం కోసం జీవితం అంకితం చేసిన మహనీయుల స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆచరణలోకి తీసుకురావాలని సూచించారు. యువత దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం, సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని పేర్కొంటూ, ప్రజలకు సేవ చేయడమే పోలీసు శాఖ ప్రధాన ధ్యేయమని, అదే మహనీయులకు అందించే నిజమైన నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) మహేంద్ర మత్తె, ఏఆర్ డీఎస్పీ సుబ్బరాజు, ఎస్బీ సీఐ పుల్లారావు, డీసీఆర్బీ సీఐ రాజేష్, ఆర్ఐ కోటేశ్వరరావు, ఆర్ఐ బ్రహ్మానందం, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది పాల్గొని అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళులర్పించారు.






## వైసిపి నాయకులు ఆగడాలు - చోద్యం చూస్తున్న అధికారులు

**కిర్లంపూడి, విశ్వం వాయిస్ న్యూస్ :** అధికార పార్టీ చేతకాని తనమో వైసిపి నాయకుల తెగింపో అర్థం కావడంలేదు కాని కూటమి ప్రభుత్వం వచ్చి రెండేళ్ళు పూర్తి కావస్తున్నా...అర్థబలమో అంగ బలమో తెలియడం లేదు కానీ రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో వైసిపి నాయకుల హవాయే నడుస్తుంది.....సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలనే అధికారులు పట్టిచుకోవడం లేదు. కాకినాడ జిల్లా, జగ్గంపేట నియోజకవర్గం, కిర్లంపూడి మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన పోకల సర్వారాయుడు అనే రైతు నీరుపోయే దారికోసం 14ఏళ్ళ పోరాటం చేస్తున్నారని ఇటీవల వార్తను ప్రచురించడం పాఠకులకు విధితమే...దీనిపై స్పందించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో గ్రామంలో బరితెగించిన వైసిపి నాయకులు దేవాలయం పేరుతో మొత్తం కాలువను ముసివేసి గ్రామాన్ని మొత్తం ప్రమాదంలో పడేసారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో చిన్నపాటి నుంచి మోస్తరు వర్షాలు వచ్చినా చెరువులు నిండి ఆ నీరు బయటకు పోయే మార్గం లేక గ్రామం నీటమునిగి చాలా మంది ప్రాణాలు పోయే పరిస్థితి ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విధంగా 2024లో వచ్చిన బారీ వర్షాలకు గ్రామం నీటమునిగిన నేపద్యంలో పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలించి, గ్రామం నీటమునగడానికి కారణం కాలువను ముసివేయడమే కారణమని, కాలువ ఆక్రమణలను వెంటనే తొలగించి వెడల్పు చేయాలంటూ స్వయంగా జిల్లా కలెక్టర్‌కు ఆదేశించడం జరిగింది. అయినప్పటికీ ఇప్పటివరకు అధికారుల్లో ఎటువంటి చలనం కనిపించలేదు. కాలువ ఆక్రమణలు తొలగించకపోగా పాతగుడి పున:నిర్మాణ పనుల్లో భాగంగా కొంతమంది వైసిపి నాయకులు కాలువను ముసివేయడం జరిగిందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 20అడుగులు ఉండే ఈ కాలువను ముసేసి చిన్న పాటి తూర వేసారని, బారీ వర్షాలు వస్తే ఈ తూరగుండా నీరు వెళ్ళడం అసాధ్యమని గ్రామస్తులు చెబుతున్నారు. ఆలయానికి కాలువకు ఎటువంటి సంబందం లేకపోయినా స్థానిక వైసిపి నాయకులు దౌర్జన్యంగా కాలువను ముసివేసి ఊరికే ముప్పు తీసుకొచ్చే లాగా ఉన్నారు. బారీ వర్షాలు వచ్చి ప్రమాదం జగరకుండా జిల్లా కలెక్టర్ స్పందించి ముఖ్యమంత్రి ఆదేశాలను అమలు చేసి కాలువ ఆక్రమణలను తొలగించాలని రాజుపాలెం గ్రామస్తులు కోరుతున్నారు.

## మన్యం వీరుడు అల్లూరికి ఎమ్మెల్యే ఆనందరావు ఘన నివాళి



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత స్వాతంత్ర్య సంగ్రామంలో బ్రిటిష్ పాలకులకు సవాల్‌గా నిలిచిన మన్యం వీరుడు, విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు అల్లవరం మండలం రెల్లుగడ్డ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెల్లుగడ్డ గ్రామంలోని అల్లూరి సీతారామ రాజు విగ్రహానికి అమలాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు త్యాగం, దేశభక్తి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కేవలం 27 ఏళ్ల వయసులోనే దేశ స్వాతంత్ర్యం కోసం, గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన అల్లూరి యువతకు ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అల్లవరం మండల కూటమి ముఖ్య నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అక్రమ రొయ్యల చెరువును అడ్డుకోండి

### గొల్లగరువు రైతులు ఆందోళన





**కాట్రేనికోన,విశ్వం వాయిస్ న్యూస్ :** పల్లంకుర్రు శివారు గొల్లగరువులో చేపల చెరువు పేరుతో రొయ్యల సాగుకు సిద్ధమవుతున్న చెరువును అడ్డుకోవాలనిబాధిత రైతులు శనివారం ఆందోళనకు దిగారు. ఎటువంటి అనుమతులు లేకుండా గోదావరి ఉప్పునీటిని ఇంజన్ ద్వారా రాత్రి వేళలో చెరువులకు తోడుతున్నారని ఆరోపించారు.శుక్రవారం రాత్రి నీటి తోడకాన్ని రైతులు అడ్డుకున్నారు. చెరువు చుట్టూ సుమారు 350 ఎకరాల వరి పంట ఉందని ఎకరం 50 బస్తాల పండే వరి చేను ఈ చెరువుల వలన కనీసం 30 బస్తాలు పండడం లేదని వీరు ఆరోపించారు. గత ఐదు నెలలుగా కాట్రేనికోన మండల మత్స్యశాఖ అధికారి, మండల తహసిల్దార్ వారికి ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకోలేదని అన్నారు.అక్రమంగా నీటిని తోడుతుండగాపట్టుకున్నందుకు తిరిగి తమపై కేసులు పెట్టారని బాధితులు ఆరోపించారు. అక్రమ చెరువు సాగును అధికారులు అడ్డుకోకపోతే తమ ఆందోళన ఉదృతం చేస్తామని వీరు హెచ్చరించారు.

### డిజిటలైజేషన్ ప్రక్రియను

## పారదర్శకంగా చేయాలి



**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** సర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని పల్లంకుర్రు, పల్లం గ్రామ పంచాయతీల బూత్ లెవెల్ అధికారులను ఎంపీడీఓ బి.రాజేశ్వరరావు ఆదేశించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా సమగ్ర సవరణ విషయమై సంబందిత బూత్ లెవెల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. తక్కువ ప్రగతి కనబరిచిన బిఎల్ఓలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల విధుల్లో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమీక్షలో పంచాయతీ కార్యదర్శులు రామారావు, శాంతి స్వరూప్, స్వర్ణ గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా వంగవీటి జయంతి వేడుకలు



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గం అంబాజీపేట మండలం కె.పెదపూడి గ్రామం సెంటర్లో శనివారం బెజవాడ బెబ్బులు బడుగు బలహీన వర్గాల ఆశజ్యోతి కీ॥శే॥ స్వర్గీయ వంగవీటి. మోహన్ రంగా 79 వజయంతి కార్యక్రమం రంగా అభిమానుల సమక్షంలో ఘనంగా నిర్వహించడం జరిగింది కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పెద్దలు గంధం.పల్లంరాజు పాల్గొని రంగా విగ్రహానికి పూలమాలవేసి ఘనమైన నివాళులు అర్పించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ కార్య నిర్వాహన కార్యదర్శి పెదపూడి శ్రీనివాస్ కూటమి నాయకులు గొల్లకోటి నరేష్, బొరుసు రాజా . నేదునూరి పెద్దిరాజు రాయపురెడ్డి సత్యనారాయణ. చిక్కం పలం రాజు. యర్ర తేజ రామ్ చరణ్ . యర్ర స్వామి నాయుడు. మాదిరెడ్డి పుల్లయ్య యర్ర శ్రీను. యర్ర నారాయణమూర్తి.. యర్ర సాయిరాం. యర్రగంగాధర్, రంగా అభిమానులు తదితరులు. రంగా 79 జయంతి వేడుకలో పాల్గొన్నారు.

## భాష్యం బ్లూమ్స్ అమలాపురంలో ఘనంగా వనమహోత్సవం




**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురంలోని భాష్యం బ్లూమ్స్ పాఠశాలలో వనమహోత్సవ కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఇళ్ల నుంచి మొక్కలను తీసుకువచ్చి పాఠశాల ఆవరణలో నాటారు. పచ్చదనాన్ని పెంపొందించాలనే సంకల్పంతో మొక్కలు నాటి, వాటిని సంరక్షించాల్సిన అవసరంపై అవగాహన కల్పించే నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మేడిద సీతార మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి, అది చెట్టుగా ఎదిగే వరకు సంరక్షించడం తన బాధ్యతగా భావించాలని సూచించారు. ప్రకృతిని కాపాడితేనే భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించగలమని ఆమె అన్నారు. పాఠశాల చైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై చూపుతున్న చైతన్యం అభినందనీయమని పేర్కొన్నారు. సమాజంలో పచ్చదనాన్ని పెంపొందించడంలో చిన్నారుల పాత్ర ఎంతో కీలకమని ఆయన అన్నారు. ఈస్ట్ జోన్-3 జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాస్ మాట్లాడుతూ, విద్యార్థులు స్వచ్ఛందంగా మొక్కలు తీసుకువచ్చి నాటడం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ప్రతి ఒక్కరూ నాటిన మొక్కలను సంరక్షించి పచ్చని పరిసరాల నిర్మాణానికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వనమహోత్సవాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమం ముగింపులో పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని అందరూ ప్రతిజ్ఞ చేశారు.

## గ్రామ పంచాయితీ వేళంగిలో డ్రైనేజీల పరిశుభ్రత



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కరపమండలం వేళంగి గ్రామ పంచాయతీ అధికారి పి.ఉమామహేశ్వరి పర్యవేక్షణలో డ్రైనేజీల పూడికతీతలు జరుగుతున్నాయి. ప్రతి డ్రైనేజ్ వ్యర్థాలతో మూసుకుపోవడంతో ఆమె ప్రతి డ్రైనేజీలపై దృష్టి సారించారు. పంచాయితీ సిబ్బందితో డ్రైనేజీలలో మురికి నీరు నిలవ లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. వర్షాకాలం సీజన్ కావడంతో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి కాలనీలో చెత్తాచెదారం మరియు వ్యర్థాలను తొలగిస్తున్నారు. గ్రామ సమస్యలపై మరియు గ్రామ అభివృద్ధికి గతంలో ఎన్నడు లేనివిధంగా ఈ అధికారి చేస్తున్న పనులపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## అశ్వినికి అక్షయ ఆర్థిక సహాయం



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆలమూరు మండలం మూలస్థానం గ్రామానికి చెందిన యర్రంశెట్టి అశ్విని కి మూడు సంవత్సరాల క్రితం ప్రెగ్నెన్సీ తో రాజమండ్రి ఆసుపత్రికి వెళ్తుంటా రోడ్డు ప్రమాదం జరిగింది ప్రమాదంలో తలకి బలమైన గాయం కావడంతో తలకి ఇప్పటివరకు ఆరు ఆపరేషన్లు జరిగాయని పొట్టకి మూడు ఆపరేషన్ జరిగాయని ఇప్పటివరకు 5 లక్షల వరకు ఖర్చుయింది అని ఇప్పుడు మరో ఆపరేషన్ తలకి చేయాల్సి ఉంది దీనికి మరో మూడు లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారని వీళ్ళ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కారణంగా అక్షయ సేవా సంస్థని సహాయం కోరగా సంస్థ నుంచి.10000 రూపాయలు కే.పావని 1000 మిరియాల సుబ్బరాజు 1000. బండారు కృష్ణార్జున 500 రూపాయలు. కొల్లూరి వెంకటలక్ష్మి 500 . కల్లేపల్లి వెంకటలక్ష్మి 500 . మొత్తం 13 500 మూలస్థానం గ్రామం వెళ్లి అక్షయ సేవా సంస్థ సభ్యులు చేతుల మీదుగా యర్రం శెట్టి అశ్విని కి ఇవ్వడం జరిగింది అని దీనికి సహకరించిన సభ్యులందరికీ ధన్యవాదములు సంస్థ సభ్యులు తెలియజేశారు.

## అల్లూరికి చాంబర్ ఆఫ్ కామర్స్ నివాళులు



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** మన్యం వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా అమలాపురం నల్లవంతెన సమీపం లోని ఆయన విగ్రహానికి చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్లూరి సీతారామ రాజు దేశ స్వాతంత్ర్యం కోసం, గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం చేసిన పోరాటం చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన త్యాగస్ఫూర్తి, దేశభక్తి, ధైర్యసాహసాలు భావితరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. అల్లూరి ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టి సమాజాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్, కార్యదర్శి కొమ్మూరి వెంకటాచల ప్రసాద్, గోల్డ్ మార్కెట్ కార్యదర్శి యర్రంశెట్టి నారాయణమూర్తి, నమ్మిన వీరబాబు, ఆశెట్టి శ్రీను, అరిగెల నాని, వలవల శివరావు, రాయుడు నాని, వాసిరెడ్డి సుబ్రహ్మణ్యేశ్వరరావు, గోకరకొండ బాబులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా తయారీలో అవకతవకలు లేకుండా చుడాలి




**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** శనివారం డా.బి ఆర్.అంబెద్కర్ కోనసీమజిల్లా కాంగ్రెసుపార్టీ సమావేశానికి ముఖ్య అతిధిగా ఎ.ఐ.సి.సి కార్యదర్శి డాక్టర్ పాలక్ వర్మ ముఖ్యఅతిధిగా విచ్చేసి కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేయడానికి దిశానిర్దేశం చేశారు.కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ, మండల మిటీల నియామకాలను పర్యవేక్షించి త్వరలో మిగిలిన నియామికాలను పూర్తి చేయాలని సూచించారు. ఓటర్ల జాబితా తయారీలో అవకతవకలు లేకుండా ఉండేందుకు కాగ్రెస్ కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.మరోముఖ్య అతిధి సి.డబ్ల్యూసి మెంబర్మాజీ ఎ.పిసి సి మాజి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ముందడుగు వేసేందుకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త,నాయకులు కలసికట్టుగా అంకిత భావంతో పనిచేయాలని, రాహుల్ గాంధి ప్రధాని అయితేనే మనదేశం పురోగతి సాధిస్తుందని వివరించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కాంగ్రెస్ పార్టి రివ్యూ సమావేశంలో ఎ.ఐసి.సి మెంబెర్ యార్ల గడ్డ రవీంద్ర, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎ.పి.సి.సి మాజీ ఉపాధ్యక్షులు ముషిణి రామకృష్ణారావు, వివిధ మండలాల కాంగ్రెస్ పార్టి అధ్యక్షులు, పి గన్నవరం కోఆర్డినేటర్ ములపర్తి మోహనరావు, కొత్తపేట కోఆర్డినేటర్,రామచంద్ర పురం కోఆర్డినేటర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ముఖ్య అతిధి ఎ.ఐ.సి.సి కార్యదర్శి కార్యదర్శి ఉపన్యాసాన్ని ముషిణి రామకృష్ణారావు తెలుగులో తర్జుమాచేసారు.

కోటిపల్లి-నర్సాపురం రైల్వే మార్గాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి

### కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మకు

## రైల్వే లైన్ సాధన సమితి వినతి



**మామిడికుదురు, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని గోగన్నమఠం గ్రామానికి శనివారం విచ్చేసిన కేంద్ర ఉక్కు,భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మను కోనసీమ రైల్వే సాధన సమితి నాయకులు ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావు, సుబ్రహ్మణ్యం, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్ మర్యాదపూర్వకంగా కలుసుకుని, కోటిపల్లి-నర్సాపురం రైల్వే మార్గాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రికి వినతిపత్రం అందజేస్తూ, ఈ రైల్వే ప్రాజెక్టును రెండు విడతలుగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. మొదటి విడతలో నర్సాపురం నుంచి అమలాపురం వరకు, రెండో విడతలో కోటిపల్లి నుంచి అమలాపురం వరకు రైల్వే మార్గాన్ని నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నర్సాపురం వరకు మూడు రైళ్లను తీసుకురావడంలో కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. కోనసీమ ప్రాంత అభివృద్ధికి కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైన్ అత్యంత కీలకమని,ఈ ప్రాజెక్టు పూర్తయితే ప్రజల రవాణా, వ్యాపార, ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయని వారు పేర్కొన్నారు.

## అల్లూరికి ఘన నివాళి



**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** మన్యం వీరుడు, విప్లవ జ్యోతి అల్లూరి సీతారామ రాజు జయంతోత్సవ వేడుకలు మండల పరిషత్ కార్యాలయం నందు ఎంపీడీఓ బి.రాజేశ్వర్ రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కోలాటి సత్యవతి సత్యం సమక్షంలో అల్లూరి చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అల్లూరి ఆశయాలను యువత అందిపుచ్చుకోవాలని హితవు పలికారు.అల్లూరి త్యాగానిరతి, దేశభక్తి అనితర సాధ్యమని ఈ సందర్భంగా కొనియాడారు.కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది, స్వర్ణ గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.

# వైద్య రంగాల అభివృద్ధికి కేంద్రం అధిక ప్రాధాన్యతనిస్తోంది

**ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి - విద్యార్థుల భవిష్యత్తు కూటమి ప్రభుత్వం పెద్ద పీట : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**
**రూ.3.20 కోట్లతో అల్లు రామలింగయ్య ప్రభుత్వ హోమియోపతి మెడికల్ కళాశాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక అల్లు రామలింగయ్య ప్రభుత్వ హోమియోపతి మెడికల్ కళాశాలలో నేషనల్ ఆయుష్ మిషన్ ఆధ్వర్యంలో రూ.3.20 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) శంకుస్థాపన చేశారు. ఈ నిధులతో నూతన అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ నిర్మాణం, మినీ ఆడిటోరియం, లిఫ్ట్ ఏర్పాటు, తరగతి గదుల పునరుద్ధరణ, విద్యుత్ వ్యవస్థ ఆధునీకరణ, మహిళా విద్యార్థుల కోసం ప్రత్యేక టాయిలెట్ బ్లాక్, సెక్యూరిటీ రూమ్, ప్రహరీ గోడ నిర్మాణం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధి చేయనున్నారు. ఈ సందర్భంగా ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆయుష్ విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కళాశాలలో మౌలిక వసతుల కొరత లేకుండా అన్ని అవసరాలను దశలవారీగా తీర్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. మహిళా విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మహిళల టాయిలెట్ నిర్మాణాన్ని అత్యవసరంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించినట్లు చెప్పారు. గతంలో అధ్యాపకుల కొరత కారణంగా కళాశాలకు చెందిన 23 పీజీ సీట్లు రద్దయ్యే పరిస్థితి ఏర్పడినప్పుడు, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తన దృష్టికి తీసుకురాగానే వెంటనే కేంద్ర, రాష్ట్ర స్థాయిలో సంబంధిత అధికారులతో సమన్వయం చేసి సమస్యను పరిష్కరించి పీజీ సీట్లను పునరుద్ధరించగలిగామని గుర్తు చేశారు. కళాశాలకు ఎలాంటి సమస్య వచ్చినా కేంద్ర ఆయుష్ శాఖ, రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో ఈ కళాశాలను దేశంలోనే ఆదర్శవంతమైన హోమియోపతి వైద్య విద్యా సంస్థగా తీర్చిదిద్దేందుకు తమ సంపూర్ణ సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ రూ.3.20 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులు కళాశాల చరిత్రలో ఒక కీలక మైలురాయిగా నిలుస్తాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి ఇస్తున్న ప్రాధాన్యతకు ఈ కార్యక్రమమే నిదర్శనమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కళాశాలకు సంబంధించిన ప్రతి సమస్యను ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ప్రత్యేక చొరవతో పరిష్కరించారని కొనియాడారు. పీజీ సీట్లు కోల్పోయే పరిస్థితి ఏర్పడిన సమయంలో విద్యార్థులు తనను కలిసి సమస్య వివరించగా, వెంటనే పార్లమెంట్ సమావేశాల్లో ఉన్న ఎంపీ పురందేశ్వరికి సమాచారం అందించానని, ఆమె వెంటనే కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖతో పాటు రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసి, అవసరమైన అండర్‌టేకింగ్ తెప్పించి, పీజీ సీట్లను కాపాడినట్లు గుర్తు చేశారు. అంతటితో ఆగకుండా కళాశాల అభివృద్ధికి అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం నుంచి మంజూరు చేయించి, నేడు పనులు ప్రారంభమయ్యేలా కృషి చేశారని ఎమ్మెల్యే వాసు తెలిపారు. విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన విద్య అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను ప్రచారాల కోసం కాకుండా ఫలితాలు కనిపించేలా చేయడమే ఎంపీ పురందేశ్వరి పని విధానమని పేర్కొంటూ, ఆమె తీసుకొచ్చిన నిధులతో విద్యార్థులకు శాశ్వత ప్రయోజనం కలుగుతుందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, అధికారులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## "కార్మికులకు నీడ ఎక్కడ?"..


**శ్రామిక భవనం పూర్తి చేయాలంటూ భవన నిర్మాణ కార్మికుల ఆందోళన**
**ప్లకార్డులతో నిరసన.. ప్రభుత్వం వెంటనే భవనం పూర్తి చేయాలని డిమాండ్**
**త్వరలో సీఎం, ఉప ముఖ్యమంత్రిని కలిసి వినతి అందజేస్తామని కార్మిక సంఘాల హెచ్చరిక**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భవన నిర్మాణ కార్మిక సంఘాల "కార్మికులకు నీడ ఎక్కడ?"..అని బొజ్జా రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. శనివారం ఉదయం భవన నిర్మాణ కార్మిక సంఘాల సమైక్య ఆధ్వర్యంలో స్థానిక క్వారీ మార్కెట్ శ్రామిక భవనం వద్ద భారీ సమావేశం నిర్వహించారు. "కార్మికులకు నీడ ఎక్కడ?" అనే నినాదంతో ప్లేకార్డులు పట్టుకుని కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బొజ్జా రామకృష్ణ మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల పోరాటం తర్వాత శ్రామిక భవనానికి స్థలం సాధించుకున్నామని, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ కృషితో రూ.1 కోటి నిధులు మంజూరై భవనానికి పునాదులు, పిల్లర్ల వరకు నిర్మాణం జరిగిందన్నారు. అయితే ప్రభుత్వం మారిన తర్వాత రెండున్నర సంవత్సరాలు గడిచినా కనీసం ఒక స్లాబ్ కూడా వేయకపోవడం దురదృష్టకరమన్నారు. గతంలో ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ భవన నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని, మున్సిపల్ కార్పొరేషన్ గ్రీవెన్స్ సెల్‌తో పాటు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇటీవల కాలంలో నిర్మాణానికి రూ.35 లక్షలు మంజూరయ్యాయని అధికారులు చెప్పినా పనులు ప్రారంభం కాలేదని విమర్శించారు. శ్రామిక భవనం నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ.. త్వరలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌ను కలిసి తమ సమస్యను వినిపిస్తామని కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. అనంతరం రాజరాజ నరేంద్ర పెయింటర్స్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ సభ్యులకు ఎనిమిది ఈఎస్ఐ కార్డులు, రాజమహేంద్రవరం ప్లంబర్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో ఐదుగురికి ఈఎస్ఐ బాండ్లు పంపిణీ చేశారు. విశ్వకర్మ వడ్రంగి పనివాళ్ల సంఘం ద్వారా సుమారు 100 మంది సభ్యులకు యూనియన్ గుర్తింపు కార్డులు పంపిణీ చేయగా, గోదావరి ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ సభ్యులకు బీఓసీ కార్డులు, రెన్యువల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో బోర్డ్ సెంట్రింగ్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు సుంకర వెంకటేశ్వరరావు, కార్యదర్శి మీసాల గణేష్ కుమార్, సూర్యచంద్రరావు, రవి, తాటిపూడి వినాయకరావు తదితర కార్మిక సంఘాల నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విప్లవ వీరుడు అల్లూరి ఒక మహోన్నత శక్తి

**డిఈవో వాసుదేవరావు - ప్రభుత్వ కార్యక్రమంగా అల్లూరి జయంతి వేడుకలు**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** "స్వాతంత్ర్య సమర చరిత్రలో అల్లూరి సీతారామరాజు తిరుగులేని వీరుడని, ఒక మహోన్నత శక్తిగా చరిత్రలో నిలిచారని జిల్లా విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు అన్నారు. స్థానిక కోటగుమ్మం వద్ద గల జిల్లా విద్యాశాఖాధికారి కార్యాల యంలో సీతారామరాజు జయంతి వేడుకలు ప్రభుత్వ కార్యక్రమంగానిర్వహించారు. గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవ పరిరక్షణ కోసం బ్రిటిష్ పాలనకు ఎదురొడ్డి అపూర్వ సాహసాన్ని ప్రదర్శించిన మహనీయుడని,. ఆయన త్యాగం, దేశభక్తి యావత్ భారత జాతికి చిరస్మరణీయం" అని కొనియాడారు. అల్లూరి చిత్ర పటానికి పూలమాల తో నివాళులర్పించారు. రాజమహేంద్రవరంలోని జన్ను మహంతి బంగారయ్య ప్రాథమిక పాఠశాలలో సీతారామరాజు నాలుగవ తరగతి వరకు చదువుకున్నారని చరిత్ర చెబుతోందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖాధికారి కార్యాలయ ఎడి వెంకట్రాజు, ఛాయా దేవి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ

## 125వ జయంతి సంస్మరణ

**ఎంపీ పురందేశ్వరితో ఆదిత్య వాలంటీర్లు!**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్ క్రాస్ వాలం టీర్లు 200 మంది శనివారం ఉదయం ఆనం కళా కేంద్రంలో డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సంస్మరణ పక్షోత్సవాల్లో, విద్యార్థుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. నేడు ఆదిత్య డిగ్రీ కళాశాలతో పాటు వివిధ ప్రాంతాల విద్యాసంస్థల నుండి విద్యార్థులు అత్యధికంగా పాల్గొ నడం విశేషం. ఈ కార్యక్రమానికి రాజ మండ్రి ఎం.పి. దగ్గుబాటి పురందేశ్వరి ముఖ్య అతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో వాలంటీర్లను తీసుకువచ్చిన అధ్యాప కులకు సభలో ప్రముఖులు శాలువా లతో సత్కరించి గౌరవించారు. డాక్టర్ జి.వి.ఎస్.నాగేశ్వరరావు, ఈ గౌర వాన్ని పొందినందుకు రాజమండ్రి ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి, యూత్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్, ఎన్.ఎస్.ఎస్.పి. ఓ.డాక్టర్ బిహెచ్.వి .రమాదేవి, ప్రిన్సిపాల్స్ ఎస్. కె.ఎన్.రెహమాన్, సిహెచ్ లక్ష్మీ సరోజ, డి. రామకృష్ణ, ఎం.చంద్రశేఖర్, శ్రీరామ్ లు తమ అభినందనలు తెలియజేశారు. ఎన్ఎస్ఎస్ పిఓలు డాక్టర్ బి హెచ్. వి.రమాదేవి, పోలుకొండ సాయి,బి విమల వాలంటీర్లను పంపడంలో తమ సహాయ సహకారాలను అందించారు.

## అల్లూరి దేశభక్తి తెగువ నేటి యువతకు ఆదర్శం


**జయంతి సందర్భంగా అల్లూరికి వై.శ్రీను ఘన నివాళి**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగారాజమహేంద్రవరం స్థానిక కంబాలచెరువు చిరంజీవి పార్కులోఏర్పాటు చేసిన అల్లూరి విగ్రహానికి జనసేన కార్పొరేషన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్ పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ పాలనను ధిక్కరించి, గిరిజనుల హక్కుల కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన మన్యం వీరుడు, విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు.అడవులపై గిరిజనులకున్న హక్కులను కాలరాస్తున్న బ్రిటిష్ వారి అణచివేత అటవీ చట్టాలకు వ్యతిరేకంగా 1922-24లో జరిగిన రంప (మన్యం) తిరుగుబాటుకు ఆయన నాయకత్వం వహించారని పేర్కొన్నారు.యువతకు స్ఫూర్తి అని, కేవలం 27 ఏళ్ల చిన్న వయసులోనే దేశం కోసం, గిరిజనుల ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. అల్లూరి దేశభక్తి, తెగువ నేటి యువతరానికి ఎంతో ఆదర్శనీయమని, ఆ మహనీయుని ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని, దేశ సమగ్రత, సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వై.శ్రీను పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు, నగర ఎండోమెంట్ చైర్మన్లు, డైరెక్టర్లు, నగర నాయకులు, వీర మహిళలు, అల్లూరి సీతారామరాజు అభిమానులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం తహశీల్దారుగా

## బాధ్యతలు స్వీకరించిన శిరిగినీడి సుబ్బారావు



**కపిలేశ్వరపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కపిలేశ్వరపురం మండల నూతన తహశీల్దారుగా శిరిగినీడి సుబ్బారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు రాజమహేంద్రవరం రూరల్ మండలంలో డిప్యూటీ తహశీల్దారుగా విధులు నిర్వహిస్తున్న ఆయన పదోన్నతి పొందడంతో కపిలేశ్వరపురం మండల తహశీల్దారుగా నియమితులయ్యారు. కాగా, ఇంతవరకు కపిలేశ్వరపురం మండల తహశీల్దారుగా పనిచేసిన సుర్ల వీరాస్వామి నాయుడు నల్లజర్ల మండలానికి బదిలీపై వెళ్లారు. ఈ నేపథ్యంలో నూతన తహశీల్దారు శిరిగినీడి సుబ్బారావు అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలియజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

## వెంకటేశ్వరస్వామికి కంబాల 300కేజీల బియ్యం విరాళం

**కంబాల పేరును స్వామికి ప్రత్యేక పూజలు**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాపవరం రోడ్డులోని శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద శనివారం నిర్వహించిన అన్నసమారాధనకు విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు 300కేజీల బియ్యాన్ని విరాళంగా అందజేసినట్లు ఆలయ కమిటీసభ్యులు తెలిపారు. శనివారం స్వామివారి కళ్యాణ మహోత్సవంలో భాగంగా భారీగా నిర్వహించిన అన్న సమారాధనకు కంబాల 300 కేజీల బియ్యాన్ని అందజేశారన్నారు. ఈ సందర్భంగా కంబాల పేరుమీద స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయకమిటీ ఆధ్వర్యంలో రామసేన సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజానగరం, జగ్గంపేట, రంపచోడవరం నియోజకవర్గాలలో ఏ ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగిన కంబాల పూర్తి సహాయ సహకారాలు అందిస్తూ, ముందుంటారన్నారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు దాసరి ధర్మరాజు, బత్తుల నానాజీ, నాగ రమేష్, వీరాంజలి, కరిబండి వెంకటేశ్వర రావు,చింతల కన్నారావు,పదిలం చక్రరావు, కాకర దుర్గారావు, నందూరి దుర్గరావు, బొల్లం జానకి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ గోనగుడెం సెక్రటరీగా

## బాధ్యతలు స్వీకరించిన ఆనంద్ కుమార్



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని పశ్చిమ గోనగూడెం సెక్రటరీగా జి.ఆనంద్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. శనివారం ఆనంద్ కుమార్ మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి బత్తిన అశోక్ కుమార్, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు తదితరులను మర్యాదపూర్వకంగా కలిసి బాధ్యతలు స్వీకరించారు. ఈయన రంగంపేట మండలం నుండి బదిలీపై ఇక్కడికి విచ్చేశారు. ఎక్కడ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహించిన నదీషా పదోన్నతి పై పోలవరం జిల్లా వెళ్లారు. అనంతరం ఆనంద్ కుమార్ పలువురును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తుల సహాయ సహకారాలతో ప్రజా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తానన్నారు. అనంతరం ఆనంద్ కుమార్ కు సచివాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సెక్రెటరీ ఆనంద్ కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిన కొండేపూడి గ్రామంలో

## మన్యం వీరుడికి ఘన నివాళులర్పించిన జక్కంపూడి విజయలక్ష్మి



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం చిన కొండెపూడి గ్రామంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్ఆర్ వైయస్సార్సీపి అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు జక్కంపూడి విజయలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.మన్యంలోని గిరిజనులను సంఘటితం చేసి బ్రిటిష్ పాలనను గడగడలాడించిన విప్లవ వీరుడు సీతారామరాజు అని జక్కంపూడి విజయలక్ష్మి కొనియాడారు. స్థానిక వైఎస్ ఆర్సిపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా104వ అంతర్జాతీయ సహకార సంఘ వారోత్సవాలు : బత్తుల



**సహకార సంఘ పతాకం ఆవిష్కరణ**

**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ పిఎసిఎస్ ఆధ్వర్యంలో 104వ అంతర్జాతీయ సహకార సంఘ వారోత్సవాలు కోరుకొండ సొసైటీ అధ్యక్షులు బత్తుల గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం 104వ అంతర్జాతీయ సహకార సంఘ వారోత్సవాల్లో భాగంగా సహకార సంఘ పతాకాన్ని ఆవిష్కరించి, మానవహారం ఏర్పాటు చేసి సహకార సంఘ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గోపాలకృష్ణ మాట్లాడుతూ నేటి సాంకేతిక పరిజ్ఞానాన్ని సహకార సంస్థలు అందిపుచ్చుకుని డిజిటలైజేషన్, మొబైల్ బ్యాంకింగ్, డేటా నిర్వహణ వంటి రంగాల్లో మరింత ముందుకు నడుస్తున్నాయన్నారు. అనంతరం ఆవరణలో మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు బాధ్యతగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి బ్యాంక్ మేనేజర్ అప్పారావు, బ్యాంకు సిబ్బంది, మాజీ సీఈవో సుధాకర్ వర్మ, సీఈఓ ఆకుల వెంకటరమణ, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మిర్తిపాడు గ్రామంలో రైతులకు పాస్ పుస్తకాలు పంపిణీ



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజానగరం నియోజకవర్గం సీతానగరం మండలం మిర్తిపాడు గ్రామ సచివాలయము నందు రైతులకు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు సీతానగరం తహసిల్దార్ అంకం శ్రీనివాస్ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు తమ భూములను రీ సర్వే చేయించుకొని పాత పాస్ పుస్తకాలు ఇచ్చి కొత్త పాస్ పుస్తకాలు తీసుకోవాలని అన్నారు. ఎవరి ఫోటోలు లేకుండా ప్రభుత్వ గుర్తుతో కూటమి ప్రభుత్వం పాసు పుస్తకాలు పంపిణీ చేయడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
సువర్ణావకాశం
₹99/- లకే మీ ప్రకటన!
స్థానిక వ్యాపారాన్ని పదిమందికి పరిచదుం చేయండి! అత్యంత తక్కువ ధరకే క్లాసిఫైడ్స్.
ఇల్లు అమ్మకాలు / అద్దెలు
వాహనాల అమ్మకం
ట్యూషన్ & & విద్య
ఉద్యోగ అవకాశాలు
సర్వీసు& రిపేర్లు
ఇతర ప్రకటనలు
ఎందుకు విశ్వం వాయిస్?
అత్యంత తక్కువ ధర (₹99 మాత్రమే)
కాకినాడ పరిధిలో విస్తృత ప్రచారం
సోషల్ మీడియాలోనూ ఉచిత ప్రమోషన్
ఇప్పుడే సంప్రదించండి: 9246033999, 7579339999 9246033999 కాకినాడ కార్యాలయం

## సంక్రాంతికి కాదు..
# అప్పుడే రావాలని చూస్తున్న బాలయ్య..?




గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం తన కెరీర్‌లోని 111వ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. దర్శకుడు గోపీచంద్ మలినేని డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాకు 'ఎన్‌బీకే111' అనే వర్కింగ్ టైటిల్‌ను ఫిక్స్ చేశారు. ఇక ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుండటంతో ఈ మూవీ అప్డేట్స్ కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే, ఈ సినిమాను సంక్రాంతి సీజన్‌లో రిలీజ్ చేయాలని మేకర్స్ తొలుత భావించారు. కానీ, ఆ సమయంలో బాక్సాఫీస్ దగ్గర భారీ పోటీ ఉండనుండటంతో డిసెంబర్ నెలాఖరులో ఈ చిత్రాన్ని రిలీజ్ చేయాలని బాలయ్య అండ్ టీమ్ భావిస్తున్నారు. దీనికోసం షూటింగ్‌ను శరవేగంగా పూర్తి చేసి, పోస్ట్ ప్రొడక్షన్ పనులకు తగినంత సమయం ఉండేలా చూసుకోవాలని బాలయ్య చిత్ర యూనిట్‌కు సూచించినట్లు తెలుస్తోంది. మేకర్స్ నుండి ఇంకా అధికారిక ప్రకటన రానప్పటికీ, డిసెంబర్ రిలీజ్ విండో వైపే డిజిటల్ భాగస్వాములు కూడా మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ వివిధ ప్రాంతాల్లో శరవేగంగా జరుగుతోంది. ఇటీవల ముంబై షెడ్యూల్ కూడా విజయవంతంగా పూర్తయింది. ఈ సినిమాలో కాజల్ అగర్వాల్, మంచు మనోజ్, సముద్రఖని, శరత్ కుమార్ తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. థమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను వెంకట సతీష్ కిలారు ప్రొడ్యూస్ చేస్తున్నారు.

# 'నాగబంధం' మూవీ రన్‌టైమ్‌లో మార్పు..
## కొత్త రన్‌టైమ్ ఎంతంటే..?




విరాట్ కర్ణ, నభా నటేష్ ప్రధాన పాత్రల్లో అభిషేక్ నామా దర్శకత్వంలో రూపొందిన మైథలాజికల్ అడ్వెంచర్ చిత్రం 'నాగబంధం' మంచి అంచనాల మధ్య బాక్సాఫీస్ దగ్గర జూలై 3న రిలీజ్ అయ్యింది. ఈ సినిమాకు థియేటర్లలో మంచి రెస్పాన్స్ వస్తుండటంతో మేకర్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఈ సినిమాకు సంబంధించి మేకర్స్ తాజాగా ఓ పెద్ద అప్డేట్ ఇచ్చారు. ఈ సినిమాను 3 గంటల 5 నిమిషాల రన్‌టైమ్‌తో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. కాగా, ఇది లెంగ్తీగా ఉందనే రెస్పాన్స్ రావడంతో ఇప్పుడు ఈ రన్‌టైమ్‌ను తగ్గించినట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ సినిమాను 20 నిమిషాల పాటు ట్రిమ్ చేసినట్లు చిత్ర యూనిట్ తెలిపింది. దీంతో ఇప్పుడు ఈ మూవీ 2 గంటల 45 నిమిషాల రన్‌టైమ్‌తో ప్రేక్షకులను అలరించబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రాన్ని ఎన్‌ఐకే స్టూడియోస్, అభిషేక్ పిక్చర్స్ బ్యానర్లపై కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి నిర్మించగా ఈ మూవీలో రిషబ్ సాహ్ని, ఐశ్వర్య మీనన్, జగపతి బాబు, మురళీ శర్మ కీలక పాత్రలు పోషించారు.



# అనిల్ రావిపూడి-వెంకటేష్ మూవీపై కీర్తి సురేష్ క్లారిటీ.. రీమేక్ కాదట..!

టాలీవుడ్ హిట్ మెషిన్ డైరెక్టర్ అనిల్ రావిపూడి ప్రస్తుతం విక్టరీ వెంకటేష్ మరియు నందమూరి కళ్యాణ్ రామ్‌లతో కలిసి ఒక ఫన్-ఫిల్డ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను పట్టాలెక్కిస్తున్నాడు. ఇటీవలే ఈ సినిమా షూటింగ్ కూడా ప్రారంభమైంది. అయితే, ఈ చిత్రం మలయాళంలో రూపొందిన ఓ చిత్రానికి రీమేక్ అనే వార్తలు సినీ సర్కిల్స్‌లో జోరుగా చక్కర్లు కొట్టాయి. పృథ్వీరాజ్ సుకుమారన్ నటించిన సూపర్ హిట్ సినిమా 'గురువాయూర్ అంబలనాదరుల్'కు ఈ సినిమా రీమేక్‌గా రాబోతుందనే వార్తలు వినిపించాయి. ఈ మల్టీస్టారర్ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్న కీర్తి సురేష్ తాజాగా ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఈ పుకార్లకు చెక్ పెట్టింది. ఈ సినిమా రీమేక్ కాదంటూ వస్తున్న పుకార్లను ఆమె పూర్తిగా కొట్టిపారేసింది. ఈ క్రేజీ కామెడీ ఎంటర్‌టైనర్ పూర్తిగా అనిల్ రావిపూడి రాసుకున్న ఒరిజినల్ కథతోనే తెరకెక్కుతోందని స్పష్టం చేస్తూ బేస్‌లెస్ రూమర్లకు ఫుల్ స్టాప్ పెట్టింది. ఈ సినిమాలో మరో హీరోయిన్‌గా కృతి శెట్టి నటిస్తుండగా, ప్రముఖ సంగీత దర్శకుడు జి.వి.ప్రకాష్ కుమార్ సంగీతాన్ని అందిస్తున్నాడు. ఈ సినిమాను 2027 సంక్రాంతి కానుకగా రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు.

# క్రికెట్ ఫ్యాన్స్‌కు పీడకల: 'మేమైతే అతన్ని కోచ్‌గా కూడా పెట్టుకోం'..
## గౌతమ్ గంభీర్‌పై సెటైర్లు.. టీమిండియా కొంపముంచింది ఆ ఒక్క పొరపాటేనా?

ఆదివారం అంటే క్రికెట్ అభిమానులకు ఓ పండుగ. టీవీల ముందు కూర్చుని తమ జట్ల విజయాలను ఆస్వాదించే రోజు. కానీ, ఈ ఆదివారం మాత్రం భారత క్రికెట్ అభిమానులకు అత్యంత చేదు జ్ఞాపకంగా మిగిలిపోయింది. నిన్నటి దాకా విజయాల ఊపులో ఉన్న భారత క్రికెట్ రెండు వేర్వేరు దేశాల్లో, రెండు వేర్వేరు ఫార్మాట్లలో ఘోర పరాజయాలను మూటగట్టుకుంది. పురుషుల జట్టు పసికూన ఐర్లాండ్ చేతిలో సిరీస్ కోల్పోయి అవమానభారంతో కుంగిపోతే, మహిళల జట్టు ఏకంగా ప్రపంచకప్ టోర్నీ నుంచే నిష్క్రమించి కన్నీరు పెట్టింది.

**అతి విశ్వాసమే కొంపముంచిందా? (ఐర్లాండ్ చేతిలో 0-2 తో చిత్తు)**

టీ20 ప్రపంచకప్ ఛాంపియన్‌గా ఉన్న భారత జట్టు.. చిన్న జట్టు అయిన ఐర్లాండ్ పర్యటనలో ఇలాంటి ఫలితాన్ని బహుశా కలలో కూడా ఊహించి ఉండదు. రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 0-2 తేడాతో కోల్పోయి చరిత్రలో తొలిసారి ఐర్లాండ్ చేతిలో క్లీన్‌స్వీప్ గురైంది. రెండో టీ20లో 155 పరుగుల మోస్తరు లక్ష్యాన్ని కూడా ఛేదించలేక కేవలం 1 పరుగు తేడాతో భారత్ ఓడిపోవడం బ్యాటింగ్ వైఫల్యానికి అద్దం పడుతోంది. మొదటి మ్యాచ్‌లో అభిషేక్ శర్మ (49), రెండో మ్యాచ్‌లో తిలక్ వర్మ (55) మినహా మరెవరూ రాణించలేదు. అవకాశాలు కోసం ఎదురుచూసే శ్రేయస్ అయ్యర్, సంజు శాంసన్, ఇషాన్ కిషన్ లాంటి సీనియర్ ఆటగాళ్లు బాధ్యతారాహిత్యంగా వికెట్లు పారేసుకున్నారు. ఆటగాళ్లలో 'ఐర్లాండే కదా గెలిచేస్తాం' అన్న అతివిశ్వాసం స్పష్టంగా కనిపించిందని మాజీ ఓపెనర్ సదగోపన్ రమేష్ విశ్లేషించారు. పిచ్ పరిస్థితులను అర్థం చేసుకోకుండా, పేలవమైన షాట్ల ఎంపికతో బ్యాటర్లు పెవిలియన్ చేరారని ఆకాశ్ చోప్రా మండిపడ్డారు. కుర్రాడు వైభవ్ సూర్యవంశీ లాంటి ఫామ్‌లో ఉన్న ఆటగాళ్లను కాదని, పదే పదే విఫలమవుతున్న వారికి అవకాశాలు ఇవ్వడాన్ని మహ్మద్ కైఫ్ తప్పుబట్టాడు.

**కోచ్ గంభీర్‌పై ట్రోల్స్, వ్యూహాత్మక తప్పిదాలు**



ఈ ఘోర పరాజయం తర్వాత హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ వ్యూహాలు ప్రశ్నార్థకమయ్యాయి. నెట్టింట ఆయనపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

**ఐస్‌లాండ్ క్రికెట్ సెటైర్లు:** ఎప్పుడూ సోషల్ మీడియాలో చురుకుగా ఉండే ఐస్‌లాండ్ క్రికెట్ బోర్డు గంభీర్‌ను లక్ష్యంగా చేసుకుంది. "టీమిండియాను తీసుకెళ్లి ఐర్లాండ్ చేతిలో ఇలాంటి ఫలితాలు రాబట్టాలంటే అసాధారణ ప్రతిభ కావాలి. మేమైతే గంభీర్‌ను మా జట్టుకు కోచ్‌గా అసలు నియమించుకోం" అంటూ తీవ్ర స్థాయిలో ఎద్దేవా చేసింది. జట్టు కూర్పులో గంభీర్ చేస్తున్న ప్రయోగాలు వికటిస్తున్నాయని మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ విశ్లేషించారు. తుది జట్టులో ఆల్ రౌండర్లకే పెద్దపీట వేస్తూ, స్పెషలిస్ట్ మిడిలార్డర్ బ్యాటర్లను పక్కన పెట్టడం వల్లే బ్యాటింగ్ కుప్పకూలుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. టీ20ల్లోకి శుభ్‌మన్ గిల్‌ను తిరిగి తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు.

**కంగారుల చేతిలో చిత్తయి.. కప్‌కు కట్! (మహిళల జట్టు నిష్క్రమణ)**

పురుషుల జట్టు ఓటమి అభిమానులకు కోపం తెప్పిస్తే.. మహిళల జట్టు ఓటమి వారిని తీవ్ర నిరాశకు గురిచేసింది. టీ20 ప్రపంచకప్ గ్రూప్ దశలో ఆస్ట్రేలియాతో జరిగిన 'డూ ఆర్ డై' మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సేన 6 వికెట్ల తేడాతో ఓడిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించింది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 170/4 భారీ స్కోరు సాధించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (56), స్మృతి మంధాన (38), షెఫాలి వర్మ (34) రాణించారు. అయితే, ఆరంభంలో ఓపెనర్లు అతి జాగ్రత్తగా ఆడటం వల్ల పవర్‌ప్లేలో ఆశించిన పరుగులు రాలేదు. ఆ డాట్ బాల్స్ ప్రభావం తుది స్కోరుపై పడింది. ఛేదనలో ఆసీస్ 85/3 తో కష్టాల్లో పడినప్పుడు భారత్ మ్యాచ్‌పై పట్టు బిగించింది. కానీ, అక్కడే మన బౌలర్లు, ఫీల్డర్లు చేతులెత్తేశారు. ఎలీస్ పెర్రీ (56), ఆష్లీ గార్డ్‌నర్ (53 నాటౌట్) అద్భుతమైన భాగస్వామ్యంతో మ్యాచ్‌ను లాగేసుకున్నారు. ముఖ్యంగా ఇన్నింగ్స్ ద్వితీయార్థంలో రేణుక సింగ్ లాంటి ప్రధాన బౌలర్లు దారుణంగా పరుగులు సమర్పించుకోవడం, కీలక సమయాల్లో ఫీల్డింగ్ లోపాలు భారత కొంపముంచాయి.

**గుణపాఠం నేర్చుకుంటారా?**

ఈ 'అచ్చిరాని ఆదివారం' భారత క్రికెట్‌కు రెండు స్పష్టమైన సందేశాలను ఇచ్చింది.

పురుషుల జట్టుకు: ఎంతటి ఛాంపియన్లయినా సరే, ప్రత్యర్థిని తక్కువ అంచనా వేస్తే (అతివిశ్వాసం) పసికూనల చేతిలో కూడా భంగపాటు తప్పదు. టీ20ల్లో నిరంతర ప్రయోగాలు బెడిసికొడతాయి.

**మహిళల జట్టుకు:** భారీ స్కోర్లు సాధించినా, మైదానంలో ఒత్తిడిని జయించడం, క్యాచ్‌లు పట్టుకోవడం, డెత్ ఓవర్లలో కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడం రాకపోతే ప్రపంచకప్ లాంటి మెగా టోర్నీల్లో నాకౌట్ చేరడం అసాధ్యం. బీసీసీఐ, జాతీయ సెలెక్టర్లు, టీమ్ మేనేజ్‌మెంట్ ఈ ఓటములను తీవ్రంగా పరిగణించి, లోపాలను సరిదిద్దుకోకపోతే భవిష్యత్తులో ఇలాంటి ఆదివారాలు మరెన్నో చూడాల్సి వస్తుంది.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

# రోజర్ ఫెదరర్‌తో '106'వ మ్యాచ్‌ను పెట్టండి : నొవాక్ జకోవిచ్



వింబుల్డన్‌లో టెన్నిస్ స్టార్ నొవాక్ జకోవిచ్ 105వ మ్యాచ్‌ను గెలిచాడు. దీంతో టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ సరసన జకోవిచ్ నిలిచాడు. ఫెదరర్ కూడా వింబుల్డన్‌లో 105 విజయాలను నమోదు చేశాడు. అయితే, ఈ రికార్డును జకో బ్రేక్ చేయడం పెద్ద కష్టమేం కాదు. ఈ టోర్నీలో ఇది ఇంకా మూడో రౌండే. ముస్ముందు చాలా మ్యాచులు ఉన్నాయి. ఓవరాల్‌గా సింగిల్స్‌లో మార్టినా నవ్రతిలోవా అత్యధికంగా 120 మ్యాచుల్లో గెలిపొందింది. పురుషుల విభాగంలో మాత్రం ఫెదరర్ – జకోవిచ్ సమంగా నిలిచారు. మూడో రౌండ్‌లో గెలిచిన తర్వాత.. వింబుల్డన్ నిర్వాహకులకు ఓ విన్నపం చేశాడు. "నేను ఈ మ్యాచ్ సమయంలో కాస్త ఒత్తిడికి గురయ్యా. మిగతా సమయాల్లో కంటే అదనంగా టెన్షన్ పడ్డా. ఈ మ్యాచ్ సవాళ్లు విసురుతుందని తెలుసు. రోజర్ ఫెదరర్ రికార్డును సమం చేయడం గొప్పగా భావిస్తున్నా. ఈ సందర్భంగా నిర్వాహకులకు ఓ విజ్ఞప్తి. ఆ '106'వ విజయం కోసం మా ఇద్దరి మధ్య మ్యాచ్ నిర్వహించాలని ప్రపోజ్ చేస్తున్నా" అని జకోవిచ్ వ్యాఖ్యానించాడు.

**నాలుగో రౌండ్‌లో..**

వింబుల్డన్ మూడో రౌండ్‌లో జకోవిచ్ 7-5, 6-4, 1-6, 7-6 తేడాతో ఫ్రాన్స్ ఆటగాడు రిండరెనెచ్‌పై విజయం సాధించాడు. ఇక నాలుగో రౌండ్‌లో రష్యా ఆటగాడు రోమన్ సఫిల్లిన్‌తో జకో తలపడతాడు. మరోవైపు డిఫెండింగ్ ఛాంపియన్ జనిక్ సినర్ కూడా నాలుగో రౌండ్‌కు చేరాడు. జపాన్‌కు చెందిన షింటారో మోచిజుకితో సినర్ నాలుగో రౌండ్‌లో తలపడతాడు.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com